జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 5 సంచిక 188 | హైదరాబాద్, ఏప్రిల్ 30 శనివారం 2022 | 8 పేజీలు | వెల : 5.00



# నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

## బొగ్గు కటకట, దేశ వ్యాప్తంగా నిల్వలు నిల్..

దేశ వ్యాప్తంగా ఎండలు విపరీతంగా పెరుగుతున్నాయి. వేడి పెరగడంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. అనేక రాష్ట్రాలు విద్యుత్ డిమాండ్‌ను తీర్చలేకపోతున్నాయి. దేశ వ్యాప్తంగా ఉన్న చాలా నగరాల్లో పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటేసింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, బీహార్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, పంజాబ్, హర్యానాలలో వేసవి ప్రారంభం నుంచే విద్యుత్ కోతలు ప్రారంభం అయ్యాయి. బొగ్గు గనులు ఉన్న ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో కూడా విద్యుత్ కోతలు తప్పడం లేదు. జార్ఖండ్ ప్రభుతం యాజమాన్యం లోని పవర్ తెనుఘాట్ థర్మల్ పవర్ స్టేషన్‌లో కేవలం 17.6 మిలియన్ టన్నుల బొగ్గు ఉంది. బొగ్గు కొరత ఎదుర్కొం టున్న మహారాష్ట్ర కూడా వ్యవసా యానికి విద్యుత్ సరఫరా తాత్కాలి కంగా తగ్గించినట్టు తెలుస్తున్నది. అయినా విద్యుత్ కోతల్లేవని తేల్చి చెప్పింది. గుజరాత్, తమిళనాడు వంటి రాష్ట్రాలు ప్రభుత రంగ సంస్థలను ఖరీదైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు అనుమతించడంతో కోతలు తగ్గుతున్నాయి.

**రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్..**

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కారణంగా దేశంలో పలు నగరాలు లోడ్ షెడ్డింగ్‌ను ఎదుర్కొంటున్నాయి. ఏప్రిల్ 26న దేశ పవర్ గ్రిడ్ 201 గిగా వాట్స్ రికార్డు డిమాండ్‌ను ఎదుర్కొంది. అంతకుముందు 2021 జులై 7న 200 గిగా వాట్స్ డిమాండే ఇప్పటి వరకు అత్యధికం. అయితే విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతూ వచ్చింది. మార్చి మధ్య నుంచి గ్రిడ్లు 195 గిగా వాట్స్ పైన డిమాండ్ ఎదుర్కొన్నాయి. ఇళ్లలో ఏసీల వినియోగం పెరగడంతో.. మార్చి, ఏప్రిల్‌లో ఉష్ణోగ్రతలో అసాధారణ పెరుగుదల కనిపిస్తోంది. ఉష్ణోగ్రత పెరగడంతో.. ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ఎలక్ట్రిక్ ఫ్యాన్లు వంటి వాటి ఉపయోగం పెరిగింది. వాణిజ్యపరంగా కూడా విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది. లోడ్ షెడ్డింగ్ వెనుక ప్రధాన కారణం బొగ్గు కొరత. పవర్ గ్రిడ్ ద్వారా నడుస్తున్న మొత్తం విద్యుత్లో దాదాపు 75 శాతం బొగ్గు నుంచే ఉత్పత్తి అవుతుంది.

# హైదరాబాద్‌లో నిర్మాణ రంగానికి ఎలాంటి ఢోకాలేదు

**క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం సందర్భంగా కేటీఆర్**



హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ దూసుకుపోతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలోని మిగతా మెట్రో నగరాల కంటే ఎంతో ముందున్నదని చెప్పారు. మాదాపూర్ హైటెక్స్‌లో జరుగుతున్న క్రెడాయ్ ప్రాపర్టీ షోను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్మాణ రంగానికి ఎలాంటి ఢోకాలేదన్నారు. మరో 10 నుంచి 15 ఏండ్లు హైదరాబాద్‌కు ఢోకాలేదని స్పష్టం చేశారు. కొన్ని కంపెనీల కుమ్మక్కు వల్లే స్టీల్, సిమెంటు ధరలు పెరిగాయని, ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. త్వరలో ఫార్మా సిటీని ప్రారంభిస్తామన్నారు..బయటి రాష్ట్రాల వాళ్లు బతుకుదెరువుకోసం తెలంగాణకు వస్తున్నారని, కానీ మనవాళ్లు దుబాయ్ పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికులకు ఉపాధి కల్పించేలా క్రెడాయ్ ముందుకు రావాలని సూచించారు. తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. అందుకు అవసరమైన సాయం ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. దక్షిణ తెలంగాణపై క్రెడాయ్ దృష్టిపెట్టాలని సూచించారు.సీఎం కేసీఆర్‌ను విమర్శించడమే విపక్షాలకు తెలుసునని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణకు ఏం చేస్తారో విపక్ష నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఏడు శాతం గ్రీన్ కవర్ పెంచిన (మిగతా 2లో..)

# కేంద్రానికి చికిత్స చేయాలి

## దుష్టశక్తుల ఆటలు ఎక్కువ కాలం సాగవు.. ఇఫ్తార్ విందులో కేసీఆర్



హైదరాబాద్, : ''భారత దేశమంతటా నేడు అంధకారం అలుముకుంది. కానీ తెలంగాణ విద్యుత్ కాంతులతో విరాజిల్లుతోంది. కేంద్రంలో పరిస్థితులు ఏ మాత్రం బాగోలేవు.. రాష్ట్రంలో అద్భుతంగా పరిస్థితులు పురోగమనంలో ఉన్నాయి. కేంద్రంలో గడబిడ నెలకొంది. అక్కడ కొంత రోగం ఉంది. చికిత్స చేయాల్సిన అవసరం ఉంది" అని సీఎం కేసీఆర్ పునరుద్ఘాటించారు. ''గత కొన్నేళ్ల క్రితం తెలంగాణ వాతావరణం అనేక ఇబ్బందులతో ఉండేది. కనీసం తాగేందుకు మంచినీళ్లు కూడా దొరకని పరిస్థితి ఉండేది. వ్యవసాయానికి నీళ్లు లేకపోయేవి. కానీ మీ అందరి సహకారంతో పరిస్థితి మారిపోయిందని ఆయన పేర్కొన్నారు.దుష్టశక్తుల ఆటలు ఎక్కువ కాలం కొనసాగవు. కొన్ని రోజుల పాటు వారిదే పైచేయి అయినట్లు కనిపిస్తుంది. కానీ చివరికి మానవత్వమే గెలుస్తుంది. మానవత్వం ఎప్పుడూ నశించదు. ఆ మానవత్వం పునాదుల మీద ఒకరినొకరు సహాయం చేసుకుంటూనే వుంటారు. సుహృద్భావ, ప్రేమపూర్వక జీవనం అందరికీ లభిస్తుంది" అని సీఎం కేసీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. శుక్రవారం రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ముస్లింలకు ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఎం కేసీఆర్ ముస్లిం సోదరులకు, దేశంలోని ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు సీఎం కేసీఆర్ చేతులమీదుగా రంజాన్ తోఫా అందించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో తాగేనీరుగానీ, వ్యవసాయంగానీ, పండే పంటలలోగానీ తెలంగాణ అద్భుత ఫలితాలను సాధించిందన్నారు. మైనార్టీ పిల్లల కోసం అద్భుతంగా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించినట్లు చెప్పారు. అన్ని వసతులతో తెలంగాణ మైనార్టీ విద్యకు ప్రాధాన్యతనిచ్చిందన్నారు. తెలంగాణ తరహాలోనే దేశమంతటా ఇదే విధానం అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం అచిర కాలంలోనే అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కిందన్న సీఎం కేసీఆర్ ఈ అభివృద్ధి సరిపోదని, ఇంకా ఎంతో అభివృద్ధి సాధించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఇంత పురోగతి సాధించినందుకు తనకు గర్వంగా ఉందన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు.''ఓ నిర్మాణాత్మక అభివృద్ధి పథంలో తెలంగాణ పయనిస్తున్నందుకు ఎంతో గర్వంగా వుంది. నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నందుకు ఆనందంగా వుంది. దేశం మొత్తంలోనే 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఖ్యాతినొందింది. ప్రతి రంగానికీ నాణ్యమైన విద్యుత్‌నే అందిస్తున్నాం. (మిగతా 2లో..)

# ఫిల్మ్ జర్నలిస్టులకు అండగా ఉంటాం: మంత్రి తలసాని

హైదరాబాద్ : మెగాస్టార్ చిరంజీవే సినీ పెద్దని తెలిపారు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.ఫిలిం జర్నలిస్టులకు హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఫిలిం జర్నలిస్టులకు టీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.దాసరి నారాయణరావు చనిపోయిన తర్వాత నుంచి తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద దిక్కు ఎవరనే విషయంపై ఎడతెరగని చర్చ నడుస్తోంది. ఇండస్ట్రీలో పూర్తి స్థాయిలో ఐకమత్యం లేకపోవడంతో పెద్దతనాన్ని స్వీకరించడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. అయితే మెగాస్టార్ చిరంజీవే పెద్ద దిక్కు అని చాలా మంది ఇండస్ట్రీ పెద్దలు ఇప్పటికే చెప్పారు. దీనిపై చిరంజీవి క్లారిటీ ఇస్తూ తాను కేవలం సినిమా బిడ్డను మాత్రమేనని ఇండస్ట్రీకి పెద్ద దిక్కును కాదని స్పష్టం చేశారు.



# యూఎన్ చీఫ్ కళ్లముందే రష్యా క్షిపణి దాడులు..

## మాస్కోలో చర్చలు, కీవ్‌లో విధ్వంసం

ఉక్రెయిన్: ఉక్రెయిన్‌ను ఎలాగైనా దారికితెచ్చుకోవాలని తహతహలాడుతున్న రష్యా అంతర్జాతీయ నియమనిబంధనలను ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అంటోనియా గుటెరస్ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో గురువారంనాడు క్షిపణులతో విరుచుకుపడింది. గుటెరస్ పర్యటిస్తున్న ప్రాంతానికి సమీపంలోని ఓ భవనాన్ని రష్యా ప్రయోగించిన క్షిపణులు తాకి విధంసాన్ని సృష్టించాయి. అయితే, ఈ ఉత్పాతంలో గుటెరస్ బృందం



సురక్షితంగా బయటపడింది. రష్యా యుద్ధోన్మాదంపట్ల యూఎన్ చీఫ్ దిగ్భ్రాంతికి గురయ్యారని ఆయన కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారంనాడు మాస్కోలో పర్యటించిన గుటెరస్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. మరియపోల్‌లోని అతిపెద్ద అజోవ్‌స్టాల్ స్టీల్ ప్లాంట్‌లో చిక్కుకుపోయిన పౌరులను, క్షతగాత్రులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, ఆహారం, మంచినీరు అందించేందుకు అవకాశం కల్పించాలన్న గుటెరస్ ప్రతిపాదనలపై పుతిన్ సానుకూలంగా స్పందించారు. రెడ్‌క్రాస్, ఐక్యరాజ్య సమితి మానవతా సాయం అందించే విభాగాలకు చెందినవారిని మరియపోల్‌లోకి అనుమతిస్తామని మాటిచ్చారు. అక్కడినుంచి తిరుగు ప్రయాణంలో గురువారం ఉక్రెయిన్‌కు చేరుకున్న గుటెరస్ కీవ్‌లోని క్షేత్రస్థాయి (మిగతా 5లో..)



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి
కాన్స్టిట్యూషన్ ద్వారా వచ్చిన హక్కుతో
కుల నిర్మూలనలో భాగంగా
కులాల పేరు మార్పు చేయమని
అడిగిన, 30రోజుల్లో
కులం పేరును మార్పు చేస్తుంది.

ఫూలే అంబేడ్కర్
రాజ్యాధికార సమితి

# ఘనంగా స్నేహ టివి హెచ్ ఆర్ పద్మాశర్మ జన్మదిన వేడుకలు..



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ) :బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం గా ప్రారంభించిన స్నేహ గ్రూప్ హెచ్ ఆర్ డిపార్ట్ మెంట్ కు హెడ్ గా, అంబేద్కర్ టివి ఛానల్ డైరెక్టర్ గా కొనసాగుతున్న పద్మాశర్మ పుట్టినరోజు వేడుకలను హైదరాబాదులోని స్నేహ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్నేహ సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివభాగ్యా రావు, స్నేహ గ్రూప్ ఎండి కటికల క్రాంతికుమార్, ఫైనాన్స్ డైరెక్టర్ సుబ్బారావు అకౌంట్స్ మేనేజర్ రామారావు, ఇన్‌పుట్ ఎడిటర్ దుర్గాప్రసాద్‌తో సహా ,స్నేహ టీవీ ఛానల్ సిబ్బంది, అంబేద్కర్ టివి ఛానల్ సిబ్బంది, ప్రజాపాలన జాతీయ తెలుగు దినపత్రిక సిబ్బంది పాల్గొని పద్మా శర్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ఆమె అంబేద్కర్ టివిలో ప్రసారం అవుతున్న సంచలన బహుజన కార్యక్రమం "మీలో ఎవరు బహుజన లెజెండ్? ప్రశ్న మాది లక్ష మీది " కార్యక్ర మానికి విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా కటికల శివభాగ్యా రావు మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారం కొరకు అన్ని కార్యక్రమాలలో ముందుండే పద్మాశర్మ ను బహుజన మహిళలు మాత్రమే కాకుండా అందరూ ఆదర్శంగా తీసుకొని పోరాడాలన్నారు ప్రతి ఒక్కరూ పాజిటివ్ ఆటిట్యూడ్ తో ముందుకు వెళితే అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమం లో పద్మాశర్మ మాట్లాడుతూ తాను ఓ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చానని, ధనం సంపాదిస్తే పోతుంది విజ్ఞానం అయితే మనతోనే ఉంటుందన్న వారి తండ్రిగారి మాటలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరు కమిట్మెంటు, డెడికేషన్ ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అన్నారు. మీరందరూ నా మీద చూపిస్తున్న అభిమానానికి మాటలు రావడం లేదనిఅన్నారు . బహుజనుల రాజ్యాధికారం కోసం అహోరాత్రులు శ్రమిస్తున్న మన చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్య రావు కు బహుజనులు అందరూ వెన్నుదన్నుగా నిలబడి బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన కృష్ణవేణి బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏపి భవన్ అసిస్టెంట్ కమిషనర్ కొత్తపల్లి లింగరాజు ఆశయాలు కొనసాగిస్తాం



హైదరాబాద్ ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి :న్యూ ఢిల్లీ ఎ పి భవన్ అసిస్టెంట్ కమిషనర్ డా " కొత్తపల్లి లింగరాజు ప్రధమ వర్ధంతి భీమ్ రక్ష పెడరేషన్ ఆధ్వర్యంలో హైదరబాద్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నందు మట్టుపల్లి సుబ్బారాయుడు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా మాజీ జాతీయ ఎస్సి కమిషన్ మెంబర్ రాములు . సీనియర్ దళిత నేత జె బి. రాజూ . లత ఫౌండేషన్ చెర్మెన్ కె .కె. రాజా జాతీయ మాల మాహనాడు అధ్యక్షులు జి చెన్నయ్య .పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చెర్మెన్ చోప్పార బాల క్రిష్ణ . ఎస్సి ఎస్టీ బ్యాంక్ ఎంప్లాయిస్ అధ్యక్షులు జి. శంకర్ . భీమ్ రక్ష పెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి. మహేష్ బాబు గొల్లపల్లి దయానంద్ అల్ ఇండియా ఎస్టీ వెల్పేర్ జాతీయ ప్రధాన కార్యదర్శి. పి. వి రమణ . అంబెడ్కర్ టి వి ఛానెల్ డైరెక్టర్ నెరేళ్ళ కొటేశ్వరరావు . బహుజన ఫ్రంట్ నాయకులు. మాల మాహనాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు .మాల మాహనాడు జాతీయ అధ్యక్షులు గోపోజూ రమేష్. మాల - మాల ఉపకులాల ప్రధాన కార్యదర్శి మన్నే శ్రీధర్ .భీమ్ రక్ష పెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ సిక్కి చైర్ పర్సన్ డా " సుహార్ లత దిలీప్ అధ్యక్షులు బి. ఎన్. రత్న . జై భీమ్ పత్రిక డైరెక్టర్ రాజేశ్వరి . దిశ మహిళ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఇందిరా వాలేంటిన తదితర సంఘాల ముఖ్య నాయకులు హాజరై లింగరాజు గారికి ఘణ నివాళ్ళు అర్పించారు ముందుగా ఎస్సి కమిషన్ మెంబర్ రాములు . జె బి రాజు, రాజా మాల మాహనాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య భీమ్ రక్ష పెడరేషన్ పౌండర్ మట్టుపల్లి సుబ్బారాయుడు బి ఎన్ రత్న అంబెడ్కర్ కి లింగరాజు చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు తదనంతరం బి ఎన్ రత్న గారి అధ్యక్షతన వక్తలు మాట్లాడుతూ న్యూ ఢిల్లీ ఎపి భవన్ కమిషనర్లు డా " కొత్తపల్లి లింగరాజు కందుల ఆనందరావు లేని లోటు రెండు తెలుగు రాష్ట్రాల అంబేడ్కరిస్టులకు. ఉద్యమకారులకు తీరని లోటని న్యూ ఢిల్లీ ఏ పి భవన్ లో అంబెడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించిన ఘనత వారికే దక్కుతుందని రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఎవరు వెళ్లిన ప్రేమగా పలకరిస్తూ అక్కున చేర్చుకొని వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించే వారని. వారితో ఉన్నా అనుబంధాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. ఉద్యమాల లో లింగరాజు సాఫ్ట్ వేర్ అని ఆనందరావు గారు హార్డ్ వేర్ అని సంబోధించారు ఉద్యమాల లో పాల్గొని అంబెడ్కర్ చూపిన బాటలో స్వచ్ఛందగా ప్రయాణించే వారు అనారోగ్యానికి గురైన అకాల మరణం చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయుట కొరకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు

## కొడంగల్ సిఐ అధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలలో అవెర్నెస్ ప్రేరణ కార్యక్రమం



ప్రజాపాలన కొడంగల్ ప్రతినిధి ఏప్రిల్ 29: కొడంగల్ డిగ్రీ కళాశాలలో కొడంగల్ సిఐ ఇఫ్తాకర్ అహ్మద్ వచ్చి విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖ లో ఎస్ ఐ కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా పోలీస్ డిపార్ట్‌మెంట్ లో పనిచెయ్యటం అంటే సమాజానికి సేవ చేయటం, సమాజంలో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసు శాఖ ముందుంటది,ఎమర్జెన్సీ 100 డయల్ చేయడమ్ పై అవగాహన,కొన్ని ఆశక్తికరమైన విషయాలు విద్యార్తులకు తెలియచెప్పారు.నేటి సమాజం లో జరుగుతున్న సైబర్ నేరాలకు బలైనవారు 24 గంటల్లోNCRPortal TOLL number 1936 కు డయల్ చేయడం ద్వారా డబ్బు తిరిగి పొందవచ్చు.చదువుకి సమాజానికి మధ్య తేడా, సమయం విలువ తెలుసుకొని సమయం వృధా చేయొద్దని శ్రద్దగా చదువుకొని తల్లి దండ్రులకు పేరు తీసుకరావాలని ప్రేరణ చేయటం జరిగింది.

## హైదరాబాద్‌లో నిర్మాణ రంగానికి ఎలాంటి ఢోకాలేదు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)


ఏకైక సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కాళేశ్వరం పూర్తిచేశామన్నారు. అభివృద్ధి పనుల కోసం అప్పులు చేస్తున్నామని, భవిష్యత్ తరాల కోసం పెట్టే పెట్టుబడిని అప్పులుగా చూడరాదని వెల్లడించారు.తెలంగాణ వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలకు మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. 18 నెలల్లో హైదరాబాద్‌కు కొత్త మాస్టర్‌ప్లాన్ తయారుకానుందని తెలిపారు. సొంత జాగా ఉన్నవారు ఇళ్లు కట్టుకుంటే రూ.3 లక్షలు ఇస్తున్నామని తెలిపారు.

## పార్స్ పల్నాడు జిల్లా నరసరావుపేట ఎన్జీవో అసెంబ్లీ నియోజకవర్గం కార్యదర్శిగా దారా నాగరాజు నియామకం



నరసరావుపేట ఏప్రిల్,29 ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) పల్నాడు జిల్లా నరసరావుపేట ఎన్జీవో అసెంబ్లీ నియోజకవర్గం కార్యదర్శిగా దారా నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పల్నాడు జిల్లా నరసరావుపేట ఎన్జీవో అసెంబ్లీ నియోజకవర్గం కార్యదర్శిగా కోండ్రు మెహన్ దాస్, దారా నాగరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మీరు మీ పరిధిలో రాజకీయ అవగాహన ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడంతో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా మీ పరిధిలో నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సంధర్భంగా ఆయన పేర్కొన్నారు దారా నాగరాజు నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

## పార్స్ పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా శిఖినం బుజ్జి నియామకం



నరసరావుపేట ఏప్రిల్,29 ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) నరసరావుపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా శిఖినం బుజ్జి నియమితులయ్యారు. ఈ మేరకు నరసరావుపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా కటికల రవి కుమార్, శిఖినం బుజ్జి ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మీరు మీ పరిధిలో రాజకీయ అవగాహన ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడంతో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా మీ పరిధిలో నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సంధర్భంగా ఆయన పేర్కొన్నారు శిఖినం బుజ్జి నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

## మేదారి వృత్తిదారులకు వెదురుపై సబ్సిడీ ప్రభుత్వం అందించాలి

### రాష్ట్ర నాయకులు పైళ్ళ ఆశయ్య



జన్నారం , ఏప్రిల్ 29, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో మేదరి వృత్తిదారుల సమస్యలపై సర్వే నిర్వహిస్తుండగా రాష్ట్ర నాయకులు పైళ్ళ. ఆశయ్య జిల్లా నాయకులు కనికారపు అశోక్, వడ్డేపల్లి అంజయ్య, జయమ్మ, లక్ష్మీ, మెదరి వృత్తిదారులైన మండల వారి సమస్యల్ని అడగడం జరిగిందని అన్నారు, ఈ సందర్భంగా శుక్రవారం వారు తెలిపిన వివరాలు మేదరి వృత్తిదారుల పై ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు వెదురును తిసుకరానిఇవ్వడం లేదని తెలిపారు. మా పై కఠినమైన ఆంక్షలు విధిస్తూ మావృత్తిని దెబ్బ కొడుతున్నారని ఆవేదన వ్యక్తపరచారు, జిన్నారం మండల కేంద్రంలో 450 కుటుంబాలు వెదురు కోసం ఎదురు చూస్తూ మేదారి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు, మేదారి వృత్తిదారులు చాటలు,బుట్టలు,విసనకర్రలు, కోళ్ల గుళ్ళు తదితర వస్తువులను తయారు చేస్తూ బయట ప్రాంతాలకు అమ్ముకోవడం జరుగుతుంది. మేదారి వృత్తి దారులు అడని వెదురు తీసుకువచ్చి పలు రకాల పరికరాలు తయారు చేసి వాటి ఆదాయం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటూ బ్రతుకుతున్నాం, మేదర్లపైన పైన ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలను పెద్ద ఎత్తున చేస్తున్నారని తెలిపారు. మేదరి వృత్తి దారులకు సెంటు భూమి కూడా లేదని కులవృత్తి వారి జీవనాధారం రెక్కాడితే డొక్కాడని నిరుపేదల పై ఫారెస్ట్ అధికారుల ఆంక్షలకు వల్లన వెదురు బద్దలు లాగా వాళ్ళ జీవితాలు మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మేదరి వృత్తిదారులకు వెదురు ఆంక్షలు ఎత్తివేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు ఫైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు, మేదరి వృత్తి దారులు తయారు చేసిన వస్తువులకి మార్కెట్ సౌకర్యం కల్పించాలని నిరుపేద మేదరి వృత్తిదారులకు ఫెడరేషన్ ద్వారా రూ:10 పది లక్షల రుణాలు ఇవ్వాలని కోరారు, రాష్ట్ర ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ పథకం ద్వారా ఇళ్లు ఇవ్వాలని అదేవిధంగా 50 ఏళ్లు నిండిన వృద్ధాప్య పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.ఈ కార్యాక్రమంలో రాష్ట్ర నాయకులు పైళ్ళ ఆశయ్య, జిల్లా నాయకులు యకనికారపు అశోక్, వడ్డేపల్లి అంజయ్య, జయమ్మ, లక్ష్మీ, జన్నారం మండల మేదారి వృత్తిదారులు కానికారపు సత్తయ్య, రామక్క, వడ్డేపల్లి చంద్రమౌళి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల




వికారాబాద్ బ్యూరో 29 ఏప్రిల్ ప్రజాపాలన నిరుద్యోగ యువత పోటీపరీక్షల్లో ఉద్యోగాలు సాధించి కుటుంబానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ నిఖిల అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ పద్మనాభా కళాశాలలో ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రూపులకు సంబంధించి నోటిఫికేషన్ లు జారీ చేసిన సందర్భంగా ఎస్సి , ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు శాఖల పరంగా చర్యలు చేపట్టిందని, శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సంపాదించే దిశగా కష్టపడాలని తెలిపారు. చరిత్రలో ఎప్పుడు లేని విదంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉద్యాగాలను భర్తీ చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత ఇప్పుడు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబంలో వ్యక్తిగత ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి ఉద్యోగ సంపాదనే ద్యేయంగా పెట్టుకొని చదువుకోవాలని సూచించారు. శిక్షణ ఇచ్చే రెండు నెలలు భోజన వసతి కల్పించడం జరుగుతుందని ఆమె అన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే యువతీ , యువకుల విజ్ఞప్తి మేరకు అధికారులతో మాట్లాడి వసతి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. శిక్షణలో భాగంగా స్టడీ మెటీరియల్ ను అందించడం జరుగుతుందని, ఇంకా ఏమైనా సబ్జెక్టులకు సంబంధించి మెటీరియల్ కావలసి వస్తే అధికారుల దృష్టికి తీసుకు వచ్చినట్లయితే అదనంగా సమకూరుస్తామని కలెక్టర్ తెలిపారు. శిక్షణ శిబిరంలో ఎక్కువ సంఖ్యలో యువతీలు ఉండడంపై కలెక్టర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్ , జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం , జిల్లా ట్రైబల్ అభివృద్ధి అధికారి కోటాజీ , ఎస్ ఏ పి కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సోమన్న అధ్యాపకుడు నారాయణ రావు నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# కేంద్రానికి చికిత్స చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇది ఏమాత్రం సరిపోదు. ఇంకా అభివృద్ధి సాధించాల్సి వుంది. ఆ దిశగానే అడుగులు వేస్తున్నాం" అని సీఎం కేసీఆర్ పునరుద్ఘాటించారు."తెలంగాణ కూడా దేశంలో భాగమే. దేశం, రాష్ట్రం బాగుంటేనే ప్రజలందరూ బాగుంటారు. 2014లో రాష్ట్ర తలసరి ఆదాయంతో పోలిస్తే, ఇప్పుడు పెరిగింది. మన తలసరి ఆదాయంలో సగం కూడా దేశానిది లేదు. కేంద్రం బలచహనంగా వుంటే రాష్ట్రం కూడా బలచహనంగానే వుంటుంది. ఏ పరిస్థితుల కారణంగానైనా కేంద్రంలో గడబిడ వుంటే కచ్చితంగా దానిని ఆపాలి. దానిని గాడిలో పెట్టాలి. అది మన బాధ్యత. దేశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పాలుకానివ్వదు. నాకు పూర్తి విశ్వాసం వుంది. ఎక్కడైనా ఇబ్బందులు వస్తే దానిని అధిగమించే శక్తి ఆ దేవుడు ఇస్తాడు. అలాంటి విపత్కర పరిస్థితుల వరకూ తీసుకెళ్లడు" అని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

నిర్మించడమే చాలా కష్టం

"దేనినైనా కూల్చడం చాలా సులభం. నిర్మించడమే చాలా కష్టం. బెంగళూరులో ఎలాంటి అల్లర్లు జరుగుతున్నాయో చూస్తున్నాం" అని ఈ సందర్భంగా అక్కడి అల్లర్లను సీఎం కేసీఆర్ ఉదహరించారు. దేశమంతా ఇలాగే నడుస్తోంది. ఇది సరైన పద్ధతి కాదు. ప్రజలకు కూడా ఇది అర్థమవుతోంది. దీనిని బాగు చేయాల్సిన అవసరం వుంది అని ఆయన పేర్కొన్నారు.

## జీవో 16 అమలు మద్దతు సభకు తరలిరండి

**డాక్టర్, కాంపల్లి శంకర్ పిలుపు**



బెల్లంపల్లి ఏప్రిల్ 29 ఇది ప్రజా పాలన ప్రతినిధి: జీవో నెంబర్ 16 ప్రకారం తెలంగాణ ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల, మరియు లెక్చరర్ల ,క్రమబద్ధీకరణ కు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, మే 1న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రభుత్వ మద్దతు సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని, తెలంగాణ ప్రభుత్వ కళాశాలల, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం, రాష్ట్ర అధికార ప్రతినిధి, డాక్టర్ కాంపల్లి శంకర్ శుక్రవారం నాడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతూ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సభకు తరలి రావాలనీ, శుక్రవారం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, కాంట్రాక్టు అధ్యాపకులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ విభాగాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న తమను, తెలంగాణ ప్రభుత్వం క్రమబద్ధీకరించనుండడం హర్షణీయం అన్నారు. జీవో నెంబర్ 16 విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మే 1న ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ మద్దతు సభను నిర్వహించనున్నామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు, మరియు లెక్చరర్లు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్, గజెల్లి మోహన్, ఎస్. శ్రీనివాస్, రేణు బాబు గౌడ్, మేడ తిరుపతి, పాక స్వామి, ఎం ఏ రేష్మ, దుర్గం తిరుపతి, డాక్టర్ ఎన్. ఏకాంబరం పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈఫ్తార్ విందు

**మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్**



వికారాబాద్ బ్యూరో 29 ఏప్రిల్ ప్రజాపాలన :కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈఫ్తార్ విందు ఏర్పాటు చేయనైనదని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం ముస్లీం సోదరులు పవిత్ర రంజాన్ మాసం సందర్బంగా ఉపవాస(రోజా ) దీక్షలో ఉంటారు. అదేవిదంగా వారికీ అనవాయితీగా గత కొన్ని సంవత్సరాలనుండి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన నాయకుడు మాజీ మంత్రివర్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఈఫ్తార్ విందు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కుడా ఈ కార్యక్రమన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రహీం, జొన్నల రవిశంకర్, చాపల శ్రీనివాస్ ముదిరాజ్, చామల రఘుపతిరెడ్డి వికారాబాద్ పట్టణ కౌన్సిలర్లు, మైనారిటీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో కామపిశాచి

### నిండు గర్భిణీపై ప్రసవసమయంలో లైంగిక వేధింపు

### గగ్గోలు పెట్టిన బాధితురాలు

### కామపిశాచికి 60 ఏళ్ళు ,బాధితురాలికి 26 ఏళ్ళు

### గతంలో కూడా జరిగిన ఇలాంటి సంఘటనలు

### బాధితురాలు అదే ఆసుపత్రిలో ఏ ఎన్ యం

### కామపిశాచి అదే ఆసుపత్రిలో 4 వ తరగతి ఉద్యోగి




భద్రాద్రి కొత్తగూడెం (ప్రజాపాలన బ్యూరో )భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో కామపిశాచులు తిరుగుతున్నాయి .ఒక పక్క ప్రభుత్వం, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, సౌకర్యాలు మెరుగుపర్చడానికి ప్రయత్నిస్తుంటే .అదే ఆసుపత్రిలో కొందరు ఉద్యోగులు కామపిశాచిలుగా తయారై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. అటువంటి నీచ,నికృష్ట ,దగుల్బాజీ ముదనష్టపు సంఘటన భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది.వావి వరసలు లేకుండా ..మానవత్వం లేకుండా,కనీస ఇంగితం లేకుండా ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన,సహచర ఉద్యోగి, నిండుచూలాలు అయిన ఒక యువతిపై జరిగిన లైంగిక వేధింపు గురించి వింటే ఒళ్ళు గగుర్పాటుకు గురవుతుంది. రాక్షస, పైశాచిక ఆనందం కోసం ఒక కామపిశాచి వ్యవహరించిన తీరు గమనిస్తే .....బాధితురాలు మనకు ఎవరో తెలియకపోయినా ...కనీసము మానవత్వం కలవారి రక్తం ఆగ్రహావేశాలతో సలసలా మరగటం మాత్రం ఖాయం. ఈ సంఘటనకు సంబందించిన పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి . భద్రాద్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే ఒక ఉద్యోగి ప్రసవం కోసం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ప్రసవ సమయంలో వైద్యుడు ఆ యువతికి మత్తు ఇచ్చారు. వైద్యో నారాయణో హరి అన్న విధంగా ఆ వైద్యుడు చిత్తశుద్దిగా ,త్రికరణశుద్ధిగా ప్రసవ ప్రక్రియ చేస్తున్నాడు.మత్తువలన గుండె నుండి కింద భాగం వరకు మత్తులో ఉన్న ఆ యువతికి స్పర్శ ఉండదు.

ఆ సమయంలో డాక్టర్ పక్కన ఉన్న ఒక 4 వ తరగతి ఉద్యోగి అయిన 60 సంవత్సరాల వయసు ఉన్న ఒక కామపిశాచి ఆయువతి స్థనాలపై చేతులు వేసి పిసుకు తున్నాడు.దీనిని గమనించి న బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. వెంటనే విషయాన్ని గమనిం చిన వైద్యుడు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనై,కామపిశాచి పై నిప్పులుగక్కాడు.అక్కడినుండే ఆ డాక్టర్ ఒక ఉన్నతాధికారికి దీనిపై ఫిర్యాదు చేసాడు.ఇంత నీచపు సంఘటన జరిగితే ....దీనిని మరుగున పరచడానికి కూడా ఇదే వైద్యశాలలో కొంతమంది ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి .ఈ సంఘటనపై ఎటువంటి పోలీస్ ఫిర్యాదు చెయ్యొద్దని కామపిశాచి వత్తాసు బృందాలు సదరు బాధితురాలికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తున్నది .గతంలో ఇదే కామపిశాచిద్వారా తమ లైంగిక సుఖాలకోసం సహాయ సహకారాలు తీసుకున్న కొందరు జూనియర్ కామపిశాచులు ఈ సీనియర్ కామపిశాచిని కాపాడటానికి సిగ్గూశరం లేకుండా ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. గతంలో అనేక సందర్భాలలో ఇటువంటి లైంగిక వేధింపుల ఆరోపణలు వైద్యుల మొదలు, కిందిస్థాయి సిబ్బంది వరకు అనేకమంది మీద వచ్చిన సందర్భాలు కోకొల్లలు.గౌరవం కల వ్యక్తులు,మాన,మర్యాదలు గల వ్యక్తులు భద్రాద్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయాలన్నా ,వైద్యం కోసం రావాలన్నా భయపడే భయంకర పరిస్థితులు ఇక్కడ ఉన్నట్లు జరిగిన తాజా సంఘటన స్పష్టం చేస్తున్నది.సదరు కామపిశాచికి 65 ఏళ్ళు పైనే ఉన్నా ,రికార్డులలో తక్కువ వయసును నమోదు చేసుకుని,ఉద్యోగం చేస్తూ తన నీచ నికృష్ట నిజాన్ని ప్రదర్శిస్తున్నాడని,ఇది ఈ కామపిశాచికి చిత్తకార్తె కుక్కలాంటి సహజమైన అలవాటని సమాచారం.దీనిపై ఉన్నత న్యాయవ్యవస్థ,జిల్లా కలెక్టర్,ఎస్పీలు స్పందించి సూమోటో కేసునమోదు చెయ్యాలని భద్రాచల పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో జరగవు అన్న భరోసా కూడా ప్రజలకు ఇవ్వాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే.

## విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు దోహదపడతాయి: బేతి సుభాష్ రెడ్డి



మేడిపల్లి, ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతీ సుభాష్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిలుకా నగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నల గీత ప్రవీణ్ ముదిరాజ్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ పన్నల దేవేందర్ రెడ్డి, మీర్పేట్ హెచ్ బి కాలనీ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్,మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి, కాప్రా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీ శంకర్ , కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, ఎల్బీనగర్ జోనల్ స్పోర్ట్స్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి, మున్సిపల్ అధికారులు వివిధ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, కోచ్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి: మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు

మధిర ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో శుక్రవారం నాడువంగవీడులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తా రు నాగేశ్వరరావు.తెలంగాణ ప్రభుత్వం రైతు పండించే ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తా రు నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం వంగవీటి గ్రామంలో ఐకెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రైతుబంధు కన్వీనర్ చావా వేణు, టిఆర్ఎస్ మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, సర్పంచ్ బొగ్గుల పద్మావతి బొగ్గుల వీరారెడ్డి



ఎంపీటీసీ కోటమ్మ బండి వెంకటేశ్వర్లు జనార్దన్ రెడ్డి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## హరితహారంలో 19.50 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యం

కరీంనగర్ ఏప్రిల్ 29 ప్రజాపాలన : శుక్రవారం హైదరాబాద్ బి.ఆర్.కె.ఆర్ భవన్ నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో తెలంగాణకు హరితహారం, దళిత బంధు, యాసంగి వరి ధాన్యం సేకరణ అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత సంవత్సరంలో 19.5 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని ఆయన తెలిపారు. హరిత హారం కార్యక్రమాన్ని విజయ వంతంగా అమలు చేయడం వల్ల రాష్ట్రంలో పచ్చదనం, అటవీ విస్తీర్ణం 7 .70 శాతం పెరిగిందని ఆయన గుర్తుచేశారు.అటవీ విస్తీర్ణం 10 శాతం కంటే తక్కువ ఉన్న జిల్లాల్లో పెద్ద ఎత్తున గ్రీనరీ పెంపొందించేందుకై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 19,400 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటుచేశామని, ఇప్పటి వరకు ఏర్పాటుచేయని గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. దీనితోపాటు ప్రతి మండలంలో కనీసం నాలుగు బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపు కోసం ప్రతీ మున్సిపాలిటీకి ప్రణాళిక ఉండాలని చెప్పారు. ఖాళీ స్థలాలను గుర్తించి, చిక్కటి పచ్చదనం పెంచటం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున హరితహారం మొక్కలకు వారంలో రెండు, మూడు సార్లు నీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల వద్ద, కాలువ గట్లపై పచ్చదనం పెంపు, పది శాతం కన్నా తక్కువ అటవీ విస్తీర్ణం ఉన్న జిల్లాల్లో ప్రత్యేక ప్రణాళికతో పచ్చదనం పెంచటం ఎనిమిదవ విడత హరితహారం ప్రాధాన్యతా అంశాలు అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ప్రకటించారు. అన్ని సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్ల వెంట పచ్చదనం పెంచటం అత్యంత ప్రాధాన్యతా అంశమని, ఇందు కోసం వారం రోజుల్లో యాక్షన్ ప్లాన్ ను సిద్దం చేయాలని అధికారులను ఆదేశించారు. దళిత బంధు అమలును సి.ఎస్ సోమేశ్ కుమార్ సమీక్షించారు. ప్రతి నియోజకవర్గానికి ఇప్పటికే మంజూరు చేసి లబ్దిదారులను గుర్తించిన దళితబంధు యూనిట్లను వెంటనే గ్రౌండ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లను ఆదేశించారు. వరి ధాన్యం సేకరణ గురించి ప్రస్తావిస్తూ, ఇప్పటికే ఏడు కోట్ల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, మరో 4.5 కోట్లు త్వరలో వస్తాయని ఆయన అన్నారు.

అన్ని రైతు వేదికల్లో రైతు సమావేశాలు నిర్వహించి, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు. రైతువేదికలను క్రియాత్మకంగా తీర్చిదిద్దాలని ఆయన ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ హరితహారం లో భాగంగా ఖాళీ ఉన్న భూముల లో రెవెన్యూ స్థలాల్లో బుట్టలు రోడ్ల వెంబడి కాళీగా స్థలాలను గుర్తించి మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. హరిత హారంలో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియోకాన్ఫరేన్స్ లో హైదరాబాద్ నుండి అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పిసిసిఎఫ్ డోబ్రియల్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్,ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్, హరితహారం ఓఎస్ డి శ్రీమతి ప్రియాంక వర్గీస్. ఇ జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జీవి శ్యాం ప్రసాద్ లాల్ , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సేవ ఇస్లావత్, డి ఆర్ డి ఓ శ్రీలత డిపిఓ వీర బుచ్చయ్య, బి సి ఎస్ ఓ సురేష్ ఇండియన్ సివిల్ సప్లై శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, ఈ ఓ జనార్దన్ రావు ,వివిధ శాఖల అధికారులు అధికారులు పాల్గొన్నారు.




"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు ఫూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో ఫూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |
| 15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

# ప్రజాపాలన


సంపాదకీయం

శనివారం 30, ఏప్రిల్ 2022

## పల్లెకు పట్నానికి వారధి ఓయూ

"ప్రాచీన ఆధునిక జ్ఞానాలను, సంస్కృతులను ఏ ఘర్షణా లేకుండా మేళవించాలి. భౌతిక, ఆధ్యాత్మిక రంగాలకు సంబంధించి పాత కొత్తలలోని ఉత్తమమైన వాటి నుంచి ప్రయోజనం పొందాలి. ఈ లక్ష్యాలను సాధించడానికి ఒక విశ్వవిద్యాలయం అవసరం. జ్ఞానసముపార్జనలో ఈ విశ్వవిద్యాలయం నైతిక శిక్షణ మీద దృష్టి కేంద్రీకరించాలి. అది అన్ని శాస్త్ర రంగాలలో పరిశోధనకు ప్రేరణను ఇవ్వాలి. ఉర్దూయే బోధన భాషగా ఉండాలనే సూత్రం మీద ఈ యూనివర్సిటీ పనిచేయాలి. అదే సమయంలో విద్యార్థులందరూ నిర్బంధంగా ఇంగ్లీషును కూడా అభ్యసించాలి" అంటూ ఏప్రిల్ 26, 1917న ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయ ఏర్పాటుకు 'పచ్చజెండా' ఊపాడు. ఆధునిక విశ్వవిద్యాలయాల చరిత్రలో ఓయూకు ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే దేశీయ భాష మాధ్యమంగా బోధించాలని నిర్ణయించడం. 'మీ సంస్థానం ఉర్దూ బోధన భాషగా ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని నిర్ణయించుకోవడం నాకు ఆనందాన్ని కలిగించింది' అంటూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజాంను ప్రశంసించాడు. నూట ఐదు (105) సంవత్సరాలను పూర్తి చేసుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు నేల మీద జరిగిన అనేక పెనుగులాటలకు ఒక సజీవ సాక్ష్యం. మరాఠీ, కన్నడ, తెలుగు, హిందీ, ఉర్దూ మాట్లాడే ప్రజా సమూహాల నుంచి ఎందరో మేధావులను తయారుచేసింది. సామాన్య ప్రజలను అసామాన్యులుగా తీర్చిదిద్దిన నాయకత్వానికి ఆలంబనగా ఉండింది. అనేక సామాజిక సంచలనాలకు వేదికయింది. జ్ఞానం, ఉద్యమం, సంస్కారం అనే సూత్రానికి పునాది వేసి సమకాలీన విశ్వవిద్యాలయాలకు భిన్నంగా నిలబడింది. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఓయూ ఇచ్చిన దృష్టికోణం తెలంగాణ సమాజంలో మరెక్కడా చూడలేం. వందేమాతర ఉద్యమం మొదలు మొన్నటి ప్రత్యేక తెలంగాణ పోరాటం వరకు ఓయూ తన చరిత్రను తానే తిరగరాసుకున్నది. బోధన, పరిశోధన రంగాలలో ఓయూ అద్వితీయ ప్రమాణాలను నెలకొల్పింది. మానవీయ, సామాజిక శాస్త్రాలతో పాటు, ప్రకృతి శాస్త్రాలలో జరిగిన పరిశోధనలు ప్రపంచానికి తలమానికంగా నిలిచాయి. న్యాయశాస్త్ర విద్యలో ఎందరో రాజ్యాంగ నిపుణులను ఈ దేశానికి అందించింది. ఇంజనీరింగ్ విద్య ద్వారా సాంకేతిక రంగంలో ఉత్తమ విలువలను సృష్టించింది. మేధావులను మాత్రమే కాదు, అంతర్జాతీయ కీర్తి పొందిన క్రీడాకారులను, సినిమా నటులను, కళాత్మక సినిమా దర్శకులను, ముఖ్యమంత్రులను, ప్రధాన మంత్రులను, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతలను ఓయూ అందించింది. 90వ దశకం వరకు ఓయూది ఉజ్జ్వల చరిత్ర. ప్రపంచీకరణ ప్రభావానికి అన్నిరంగాల వలె ఓయూ కూడా ఒక కుదుపునకు గురయింది. ఆనాటి పాలకులు విద్యను వ్యాపారంగా భావించారు. వస్తువును సృష్టించే సరుకుగా మార్చారు. వివేకాన్ని, చతురతను ఇచ్చే స్థానంలో బహుళజాతి మార్కెట్ అవసరాలను తీర్చే సాధనంగా మార్చారు. ప్రభుత్వాల ప్రాధాన్యతలు మారాయి. అందులో విద్య లేకుండా పోయింది. నిధులు తగ్గాయి. నియామకాలు లేకుండా పోయాయి. ఫలితంగా ఉన్నత ప్రమాణాలను నెలకొల్పిన ఓయూలో బోధన, పరిశోధనా రంగాలలో తిరోగమనం మొదలయింది. విద్యలో నాణ్యత లోపించింది. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పోటీకి తట్టుకోలేక అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక ఓయూ ఇపుడొక ఒంటరి పక్షి. ఓయూ వందేళ్ల పండుగను గంభీరంగా నడుపుతామని ప్రకటించిన పాలకులు యాభై కోట్లకు మించి నిధులు ఇవ్వలేకపోయారు. ఆ ఉత్సవాలను కూడా తూతూ మంత్రంగా నడిపారు. కనీసం ఒక పైలాన్‌ను కూడా రూపొందించలేకపోయారు.కాలం ఎన్ని సవాళ్లను విసిరినా ఓయూ నేల మాత్రం తన గంభీరతను, వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఓయూ ఎప్పటికీ పల్లెకు పట్నానికి వారధిలా ఉంటుంది. పల్లెల నుంచి ఇప్పుడిప్పుడే ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్ రావటం మొదలయింది. కింది కులాల నుంచి విద్యార్థులు నదీ ప్రవాహంలా ఓయూకు వస్తున్నారు. వారంతా ఉన్నత విద్యలోకి వస్తున్న మొదటి తరం విద్యార్థులు. పూరెస్ట్ ఆఫ్ ది పూర్‌కు జ్ఞానఫలాలను అందించవలసిన బాధ్యత రోజురోజుకు పెరుగుతున్నది. ప్రభుత్వాల వైఖరిలో కూడా మార్పు రావలసిన అవసరం ఎంతో ఉంది. పౌరసమాజం మరింత చురుకుగా వ్యవహరించాలి. బాధ్యత కలిగిన అధికారుల అవసరాన్ని ఇవ్వాల్టి విశ్వవిద్యాలయాలు కోరుతున్నాయి.ఈ నేపథ్యంలో ఓయూను రక్షించుకునే క్రమం ప్రారంభమయింది. పూర్వ వైభవాన్ని రక్షించాలి, బోధన, పరిశోధనలో నాణ్యతను పెంచాలి. స్థిర, చరాస్తులను రక్షించి భవిష్యత్ తరానికి అందించాలి. అందుకోసం నిబద్ధత కలిగిన ఆచార్యులు తమ కృషిని మొదలుపెట్టారు. విద్యాత్మక వాతావరణాన్ని యూనివర్సిటీలో కల్పించడానికి కృషి మొదల్కొంది. బయటి వారి స్వేచ్ఛా ప్రవేశం వలన ఓయూలో అకడమిక్ వాతావరణం దెబ్బతినకుండా చర్యలు ప్రారంభమయ్యాయి. ఓయూ నిర్మాణంలో విద్యార్థులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్, పూర్వవిద్యార్థులు నాలుగు స్తంభాలుగా ఉన్నారు. విద్య అంటే కేవలం క్లాస్ రూం బోధన మాత్రమే కాకుండా తక్ష్ లాంటి కార్యకలాపాలు విద్యార్థులలో కోలాహలాన్ని కల్గించాయి. సంస్కరణ మార్పుకు దారితీయాలి. ఆ మార్పు ఒక చోటి నుంచి మరో చోటికి జ్ఞానాన్ని చేరవేయాలనే లక్ష్యాన్ని ఓయూ నిర్దేశించుకుంటున్నది. సామాజిక బాధ్యత, వృత్తి నిబద్ధత కల్గిన ఆచార్యులు ఓయూ పునర్నిర్మాణం కోసం తపిస్తున్నారు. కింది వర్గాల నుంచి ఎదిగివచ్చిన ఆచార్యులు తమ మూలాలను మర్చిపోకుండా ఓయూ నిర్మాణానికి పూనుకుంటున్న సందర్భానికి చేదోడుగా నిలవవలసిన అవసరం ఉంది. నిర్మాణాత్మక విమర్శను స్వీకరించి ముందుకెళ్తున్న ఓయూ అధికారులు, అధ్యాపకుల లక్ష్యం నెరవేరాలంటే పౌరసమాజం కూడా తన బాధ్యతను నెరవేర్చాలి. ఓయూను కాపాడుకోవటమంటే వందేళ్ల తెలంగాణ చరిత్రను ప్రత్యక్షం చేసుకోవటమనే విషయాన్ని మనం మర్చిపోకూడదు. ఆ ఎరుక ఉన్నప్పుడే చైతన్యవంతమైన తెలంగాణ సమాజం ఓయూ పునర్నిర్మాణంలో భాగమవుతుంది. నిర్లిప్తంగా ఉండే పాలకుల మీద ఒత్తిడి పెట్టి, బాధ్యతను విస్మరించిన విద్యార్థి, అధ్యాపకుల మీద సమాజం మానిటరింగ్ చేసినప్పుడే వందేళ్ల వైభవాన్ని కాపాడుకోగలం. ఇక్కడి విద్యార్థులు చదవరని, అధ్యాపకులు బోధించరనే అపవాదు నిజం కాదని గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణలో ఏ పోటీ పరీక్ష జరిగినా మొదటి ర్యాంకులు ఓయూ విద్యార్థులే సాధిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన నాణ్యతకు గుర్తింపునిచ్చే 'హెచ్' ఇండెక్స్ యాభై నుంచి వంద పాయింట్లు దాటిన ప్రొఫెసర్లు ఓయూలో ఎందరో ఉన్నారు. కనుక పాలకులు కూడా చేతల్లో తమ చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. ఓయూ మీద అకారణ ద్వేషాన్ని వీడాలి. ఏటా ఓయూకు రావలసిన ఆరువందల కోట్ల బ్లాక్ గ్రాంట్‌ను ఇవ్వాలి. ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీచేయాలి.

# విషమిస్తున్న నిరుద్యోగ సంక్షోభం




పనిహక్కు భావనను ఆమోదించి, అమలువరచాల్సిన సమయం ఆసన్నమయిందా? అవును అనేదే ఆ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం. తీవ్రమవుతున్న నిరుద్యోగ సంక్షోభం, దాన్ని ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనలను నిశితంగా గమనిస్తే పనిహక్కు ఆవశ్యకత తేటతెల్లమవుతుంది. పని చేయగల సామర్థ్యమున్న ప్రతి ఒక్కరికీ జీవనాధారాన్ని లేదా పరిహారాత్మక భత్యాన్ని సమకూర్చగల ఒక బృహత్ విధానాన్ని చట్టబద్ధమైన పూచీతో మనం రూపొందించుకుని, అమలుపరచుకోవలసిన అవసరముంది. పనిహక్కు ఆవశ్యకత గురించిన వాదన మూడు ప్రశ్నలకు సమాధానమిచ్చి తీరాలి. అవి: మనకు ఆ హక్కు అవసరమా? నిరుద్యోగ సమస్యకు అది సరైన పరిష్కారమా? సత్ఫలితాలు ఇచ్చే విధంగా దాన్ని అమలువరచుకోగలమా? మరింత ముఖ్యమైన ప్రశ్న : పనిహక్కు అమలుకు అవసరమైన ధనం మనకు ఉన్నదా? మన దేశంలో ప్రస్తుతం పనిచేయగల వయస్సులో ఉన్న 101 కోట్ల మందిలో 40 శాతం మంది ఉద్యోగాన్వేషణలో ఉన్నారని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ' అధ్యయనంలో వెల్లడయింది. ఈ విషమ పరిస్థితి రానురానూ మరింత తీవ్రమవుతోంది. పనిచేసే వయస్సులో ఉండి ఉద్యోగాన్ని వెదుక్కుంటున్న వారి శాతం గత ఐదేళ్లలో 46 నుంచి 40 శాతానికి పడిపోయింది. అంటే ఆరు కోట్ల మంది ప్రజలు ఉద్యోగాన్వేషణను మానివేశారు. ఎందుకని? ఉద్యోగం లభించే అవకాశం వారికి కనుచూపు మేరలో కనిపించకపోవడమే. మరి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ప్రతి ఒక్కరికీ అది లభిస్తుందని ఖచ్చితంగా చెప్పలేము మరి. ఒక ప్రామాణిక అంచనా ప్రకారం ప్రస్తుతం మన దేశంలో నిరుద్యోగం రేటు 7.6 శాతం. అంటే 3.3 కోట్ల మందికి ఎటువంటి పనీ లేదు. నిరుద్యోగం నిర్వచనాన్ని కొద్దిగా విస్తృతం చేస్తే నిరుద్యోగుల సంఖ్య ఐదు కోట్లుగా లెక్క తేలుతుంది. ఏమైనా నిరుద్యోగ సమస్యను మీరు ఏ విధంగా చూసినా ఉద్యోగం లేని వారు, అయితే అవకాశం లభిస్తే ఉద్యోగం చేసేందుకు సుముఖంగా ఉన్న వారి సంఖ్య పది కోట్లకు తక్కువగా ఉండదు. 'నిరుద్యోగులు కాబోతున్న వారి'ని, 'సరైన జీతభత్యాలు లేని' ఉద్యోగాలు చేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకుంటే నిరుద్యోగ మహాజనుల సంఖ్య ఇంచుమించు 14 కోట్లుగా ఉండగలదని ఖాయంగా చెప్పవచ్చు. ఆధునిక చరిత్రలో మహాఘోరంగా వర్ధిల్లిన నిరుద్యోగంతో మన ప్రస్తుత నిరుద్యోగ సమస్యను పోల్చి చూడండి. 1930లలో అమెరికాలో నెలకొన్న మహా మాంద్యమే నేను ప్రస్తావించిన మహా ఘోర నిరుద్యోగం. ఆనాడు అమెరికాలో 1.5 కోట్ల మంది నిరుద్యోగులయ్యారు. అమెరికాలోని మొత్తం కార్మికులలో వారు 25 శాతం మంది. నేడు మన దేశంలో పరిస్థితి మెల్లగా సమీపిస్తున్న మహా మాంద్యంలా ఉంది. ఇప్పటికే, నాటి అమెరికాలో కంటే అనేక కోట్ల మంది అధికంగా నిరుద్యోగం కోరల్లో విలవిలలాడిపోతున్నారు. మార్గాంతరమేమిటి? అరకొర పరిష్కారాలు పనిచేయవు. రంగాల వారీగా ఎంపిక చేసుకున్న పరిశ్రమల (లేక పారిశ్రామికవేత్తలు!)కు ఉద్దీపనలు ఇస్తే సరిపోదు. 'వ్యాపార సౌలభ్యం' లేదా 'ఆత్మ నిర్భరత' ఇత్యాది అవిశ్వసనీయమైన విధానాలతో ఉద్యోగాల సృష్టి జరగదు. 1930ల నాటి మహా సంక్షోభాన్ని అమెరికా ప్రభుత్వం 'న్యూ డీల్' పథకంతో సమర్థంగా ఎదుర్కొన్నట్టే , మనకు ముంచుకొస్తోన్న మహా సంక్షోభాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున సమగ్ర కార్యాచరణతో ఎదుర్కోవాలి. నిరుద్యోగ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంలో ఆర్థిక నమూనాపై పునరాలోచన అనేది విధిగా ఒక భాగంగా ఉండితీరాలి. స్థూల ఆర్థిక విధానం, పారిశ్రామిక విధానంపై కొత్త ఆలోచనలు చేయాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పటిష్ఠపరచేందుకు ప్రాధాన్యమివ్వాలి. అయితే ఈ ప్రయత్నాలన్నీ దీర్ఘకాలంలో మాత్రమే సరైన ఫలితాల నిస్తాయి. అయితే మనకు కాలం మించిపోతోంది. ఈ విపత్సమయంలో పనిహక్కు కల్పనే మన మహాసంక్షోభానికి సమగ్ర ప్రతిస్పందన అవుతుంది. అదృష్టవశాత్తు పనిహక్కును అమలుపరిచే పద్ధతుల గురించి మనకు కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. అర్థశాస్త్ర ఆచార్యులు జీన్ డ్రెజె, సంతోష్ మెహ్రోత్ర, అమిత్ బసోలెల ప్రతిపాదనలు మన ముందున్నాయి. సోషలిస్ట్ చింతకుడు రాకేశ్ సిన్హా అధ్యయన పత్రం 'బెరోజ్ గారి: సమస్య ఔర్ సమాధాన్' పనిహక్కు భావనకు ఒక సైద్ధాంతిక ప్రాతిపదికను కల్పించింది. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నాలుగు విధాలుగా జోక్యం చేసుకోవల్సి ఉన్నది. ఈ నాలుగు పరిష్కారాలూ పనిహక్కు అనే సమగ్ర పరిష్కారంలో భాగంగా ఉంటాయి. ఉద్యోగితను పెంచడం ఎక్కడ అవసరమవుతుందో, ఎక్కడైతే సాధ్యమవుతుందో అక్కడ ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలి మరింత స్పష్టంగా చెప్పాలంటే ఉద్యోగితను నేరుగా పెంచేందుకు ప్రభుత్వం నిబద్ధమవ్వాలి. ఖాళీగా ఉన్న 25 లక్షల ప్రభుత్వోద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి. తద్వారా విద్యావంతులైన యువజనులకు ఊరట కల్పించాలి. దీంతో పాటు ఆరోగ్య భద్రత, విద్య, పోలీస్ దళాలు, పట్టణ మౌలిక సదుపాయాలు, ఇంకా పర్యావరణ విధ్వంసక నిరోధం మొదలైన రంగాలలో అదనపు ఉద్యోగాలను సృష్టించాలి.ప్రభుత్వం చేపట్టవలసిన రెండో చర్య కార్మికులు, ఉద్యోగులను యాజమాన్యాల దోపిడీ నుంచి రక్షించడం. వంద ఉద్యోగాలకు పదివేల మంది పోటీపడుతున్న దురదృష్టకర పరిస్థితుల్లో జీత భత్యాల విషయంలో యాజమాన్యాల దోపిడీని కార్మికులు ఎదుర్కొలేక పోతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మన రాజ్యాంగం నిర్దేశించింది. ఈ రాజ్యాంగ ఆదేశాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు సమర్థించింది. దీన్ని అమలుపరచడం ప్రభుత్వ కర్తవ్యం. ముఖ్యంగా, మున్ముందుగా తన కార్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి రాజ్యాంగ విహిత న్యాయం సమకూర్చాలి.మూడో పరిష్కార చర్య జాతీయ గ్రామీణ ఉపాధి హామీని దాని మౌలిక ప్రణాళిక ప్రకారం పునరుద్ధరించడం. 'ఉపాధి హామీ' పథకం తొలుత డిమాండ్–ఆధారిత పథకంగా ఉండేది. అంటే భౌతిక శ్రమ చేయగల ప్రతి ఒక్కరూ అడిగిన వెంటనే పని కల్పించేదిగా ఉండేది. మౌలిక లక్ష్యం ఏమైనప్పటికీ ఉపాధి హామీ అమలులోకి వచ్చిన కొద్దినాళ్లలో సరఫరా ఆధారిత పథకంగా మారిపోయింది. నిధుల సమస్య ఏర్పడింది. దీనిపై కేంద్రం రాష్ట్రాలు పరస్పర ఆరోపణలు చేసుకొంటున్నాయి. గ్రామీణ భారతంలో సంక్షోభం సమసిపోవాలంటే గ్రామీణ ఉపాధి హామీని డిమాండ్ ఆధారిత పథకంగానే అమలు పరచాలి. కొవిడ్ కారణంగా కోట్లాది వలస కార్మికులు తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్లడంతో గ్రామీణ భారతంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నది విస్మరించలేని వాస్తవం.ప్రభుత్వం చేపట్టవలసిన నాలుగో పరిష్కార చర్య పట్టణ ఉపాధి హామీ పథకం. గ్రామీణ ఉపాధి హామీ పథకం వలే ఇది కూడా కనీస వేతనంపై కనీసం 100 రోజుల పాటు పనికల్పనకు హామీ కల్పిస్తుంది. పట్టణ స్వపరిపాలన సంస్థలు దీన్ని అమలుపరచవలసి ఉంది. అయితే గ్రామీణ ఉపాధి హామీ కంటే దీన్ని భిన్నంగా అమలుపరచవలసి ఉంది. అనిపుణ కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు నిపుణ కార్మికులకు ముఖ్యంగా మహిళలకు పార్ట్ టైం ఉద్యోగాలను కోరుకునే మహిళలకు ఉపాధి కల్పించవలసి ఉన్నది. ఈ పథకం అమలులో ప్రైవేట్ సంస్థలను కూడా ఏదో ఒక విధంగా భాగస్వాములను చేసేందుకు అవకాశమున్నది. గ్రామీణ ఉపాధి హామీ వలే, ఇది కూడా పనికి దరఖాస్తు చేసుకుని, పనిని పొందలేనివారికి నిరుద్యోగ భృతి సమకూర్చాలి. ఈ సరికొత్త పట్టణ ఉపాధి హామీ పథకం అమలుకు అవసరమైన మౌలిక కృషి ఇప్పటికే జరిగింది. ఆర్థికవేత్తలు జీన్ డ్రెజ్, అమిత్ బసోలెల ప్రతిపాదనల ఆధారంగా ఆ కృషి జరిగింది. కేరళ, హిమాచల్, రాజస్థాన్, జార?ండ్, మహారాష్ట్ర మొదలైన రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఇప్పటికే ఇటువంటి పథకాలను అమలు పరుస్తున్నాయి.అసలు ప్రశ్న ఏమిటంటే పనిహక్కును 'మనం' అమలుపరచగలమా? మొదటి మూడు పరిష్కార చర్యలు ఇప్పటికే అమలులో ఉన్న ప్రభుత్వ పథకాల ఆధారంగా అమలుపరిచేందుకు ఆస్కారమున్నది. కొంత అదనపు వ్యయం అవసరమవుతుంది. నాల్గవది అంటే పట్టణ ఉపాధి హామీ పథకం అమలుకు చాలా పెద్ద మొత్తంలో అదనపు నిధులు అవసరమవుతాయి. ఈ పథకం కింద రూ.2.8 లక్షల కోట్లతో 3.3 కోట్ల మందికి ఉపాధి కల్పించవచ్చని అమిత్ బసోలే నేతృత్వంలోని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం పరిశోధకులు అంచనా వేశారు. ఈ వ్యయం మన జీడీపీలో 1.7 శాతం. మొదటి మూడు పరిష్కార చర్యలకు అవసరమయ్యే అదనపు వ్యయాన్ని కూడా కలుపుకుంటే పనిహక్కు అమలుకు అయ్యే మొత్తం వ్యయం మన జీడీపీలో 3 శాతంగా ఉండగలదు. నిజానికి ఇదేమంత పెద్ద వ్యయం కాదు. ఇటీవలి సంవత్సరాలలో 'మనం' చేసిన కొన్ని ఇతర వ్యయాలతో పోల్చి చూడండి. ఒక్క 2021 సంవత్సరంలోనే బ్యాంకులు రూ. 2లక్షల కోట్ల పారు బాకీలను రద్దు చేశాయి. పరిశ్రమలకు నేరుగా సబ్సిడీల రూపేణా రూ.1.9 లక్షల కోట్ల ఆర్థిక సహాయమందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కార్పొరేట్ పన్ను రేటును 30 నుంచి 22 శాతానికి తగ్గించడం వల్ల ప్రభుత్వం రూ.1.5 లక్షల కోట్ల రాబడిని కోల్పోయింది. మరి పనిహక్కు అమలుకు అవసరమైన అదనపు ఆదాయం ఎక్కడ నుంచి సమకూరుతుందని మీరు చింతిస్తున్నారా? అలాంటి చింత అవసరం లేదు. కొవిడ్ మహమ్మారి కాలంలో మన కోటీశ్వరులు రూ.20లక్షల కోట్ల లాభాలను ఆర్జించారు. నిరుద్యోగ సంక్షోభం పరిష్కారానికి ప్రభుత్వం అగ్ర ప్రాధాన్యమిస్తే అవసరమైన ఆదాయం అందుబాటులో ఉంది. అంతేకాదు మరింత ఆదాయాన్ని సృష్టించేందుకు అనేక అవకాశాలున్నాయి. మరి నిరుద్యోగం సంక్షోభం పరిష్కారానికి ప్రభుత్వం అగ్ర ప్రాధాన్యమిస్తుందా? ఇస్తుందని నేను భావించడం లేదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అసలు సమస్య తీవ్రతనే గుర్తించడం లేదు. ఇక పరిష్కారానికి ఎలా పూనుకుంటుంది? పటిష్ఠ రాజకీయ సమీకరణల ద్వారా మాత్రమే మోదీ సర్కార్ వైఖరిని మార్చవలసి ఉంటుంది. ఇప్పుడు అటువంటి ప్రజా సమీకరణలు ఎంతైనా అవసరం. ప్రభుత్వం తన ఆర్థిక విధానాలపై పునరాలోచన చేసేలా ఉద్యమాల రూపేణా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలి. పనిహక్కు అమలుకు ఒక ప్రజా ఉద్యమం అవసరం.

## ఎండా కాలం

ఎండలు బాగా మండే కాలం
నూతులు చెరువులు ఎండే కాలం
చెమటలు బాగా పట్టే కాలం
వడ దెబ్బతో వణికే కాలం
దాహం బాగా వేసే కాలం
దేహం నీటిని కోరే కాలం

పిల్లల్లారా.. పాపల్లారా
చాలా చాలా జాగ్రత్త
ఎండకు ఎక్కువ తిరగొద్దు
టోపీ గొడుగు వాడండి
నీడన ఎక్కువ మెలగండి
నీటిని బాగా తాగండి

పళ్ళరసాలు తాగిన మేలు
ఉప్పు కలిపిన మజ్జిగ చాలు
పశువులు పక్షుల కోసం
నీటిని ఒక చోట పెట్టండి
ఉక్కపోతలో చిక్కొద్దు
ఊరికే ఎండలో తిరగొద్దు

ఇది ఎండా కాలం
ఎండలు బాగా మండే కాలం
పిల్లల్లారా.. పాపాల్లారా
చాలా చాలా జాగ్రత్త!

**– గరిమెళ్ళ.వి.ఎన్.నాగేశ్వరరావు**

## నువ్వు

పూలిచ్చే మకరందాలూ
ప్రాత:కాలపు మంచు బిందువులూ
తరులిచ్చే ఫలరసాలూ
తరలి వచ్చే తేనె ప్రవాహాలూ ఒకటేమిటి
క్షీరామృత ధారలెన్నో
మది క్షేత్రాన్ని మాధుర్యమై తాకుతున్నాయి
అయినా ఎంతకీ నిండని మధు పాత్రలా
గొంతెండిన పాటలా మిగిలాను
నువ్వొచ్చావుజి
చిరకాలపు దాహార్తిని చిటికెలోన తీర్చావు
నక్షత్రాలను దోసిట తెచ్చి నా గాత్రంలో
పేర్చావు
నీ స్పర్శతో సంగీత నదిగా మార్చావు
వెలుగులీను పాటనై నీ వెంట నడిచాను
ఇంతకీ నువ్వెవరు?



– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,

## చెక్ డ్యాంల నిర్మాణాలకు ఇసుక తరలింపుకు ఆమోదం: జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్

కరీంనగర్ ఏప్రిల్ 29 ప్రజాపాలన : జిల్లాలోని చెక్ డ్యాంల నిర్మాణాల కోసం ఇసుక తరలింపుకు 8 ఇసుక రీచ్ లను గుర్తించి ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న చెక్ డ్యాంల నిర్మాణాల కోసం ఇసుక తరలించుటకు కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట మండలం వావిలాల, మానకొండూర్ మండలం ఊటూరు, వీణవంక మండలం చల్లూరు, మల్లిరెడ్డిపల్లి, కోర్కల్, పోతిరెడ్డి పల్లి గ్రామాలలలో ఉన్న 8 రీచ్ లను గుర్తించి ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రేణికుంట, కొత్తపల్లి మండలాల ఇసుక రీచ్ ల అనుమతికి కొత్త కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత పర్మిషన్ తీసుకోవాలని తద్వారా కమిటీ నిర్ణయం మేరకు ఆమోదం తెలుపబదుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, ఏ.డి .మైన్స్ సత్యనారాయణ, జిల్లా పంచాయతి అధికారి వీరబుచ్చయ్య, ఈ.ఈ. శ్రీనివాస్, ఆర్.ఎస్.డబ్ల్యు ఈ.ఈ. సతీష్, భూగర్బ జలాల శాఖ సంచాలకులు మల్లికాదేవి, తహశిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలో తేలిన ప్రభుత్వ భూములకు హద్దులు వేయాలని తిమ్మాపూర్ తాహాశిల్దార్ కు మెమోరాండం అందజేసిన సిపిఐ నాయకులు

కరీంనగర్ : మండల కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ గ్రామ శివారులో వ్యవసాయ భూమి 1183, 1184, 1190, సర్వేనెంబర్ లో గల భూమిని ప్లాట్లుగా చేసి అమ్ముకున్నారుని, అయితే ఈ సర్వే నెంబర్లకు ఆనుకొని ఉన్నటువంటి ఎస్సారెస్పీ భూమిని సైతం అందులో కలుపుకొని ప్లాట్లకు రోడ్డు గా ఏర్పాటు చేసి గురాక్రమణకు పాల్పడుతున్నారన్నారు. కొంత భాగాన్ని ప్లాట్లలో కలుపుకున్నాడని ఆరోపిమచారు. దీనిపైన సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అధికారులకు గతంలో తెలియపరచడం జరిగిందని, అధికారులు స్పందించి సర్వే చేయడం జరిగిందని, అనుకున్నట్టుగానే రోడ్డు గా వాడుకున్న భూమి ఫ్లాట్ లో కలిసిన భూమి ఎస్సారెస్పీది అని తెలడం జరిగిందన్అనారు. యితే ఆ తేలిన భూమికి హద్దులు వేయకపోవడం వల్ల రియల్టర్ మళ్లీ తనకు అనుకూలంగా వాడు కోవడం జరుగుతుందని, కనుక మండల తాసిల్దార్ దీనిపైన తక్షణమే స్పందించి తేలిన ప్రభుత్వ భూమికి బౌండరీలు వేయాలని కోరారు ప్రభుత్వ భూమిఅని బోర్డు సూచిక ఏర్పాటు చేయాలని కరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి మండల సహాయ కార్యదర్శి పిట్టల శ్రీనివాస్ పర్ల పెల్లి గ్రామ శాఖ కార్యదర్శి గూడూరు రమేష్ లు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్ ఫ్లాట్ ఓనర్స్ సమావేశం



మేడిపల్లి, ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ భగాయత్ రైతు సంఘం ఆధ్వర్యంలో భగాయత్ ఫ్లాట్ ఓనర్స్ సమావేశం మే1తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకుఉప్పల్లోని లక్ష్మీ రెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ రైతు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో ఉప్పల్ భగాయత్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కమిటీకి సంబంధించిన విధివిధానాలపై అలాగే కమిటీ కూర్పుపై విస్తృతమైన చర్చ జరుగుతుంది కాబట్టి ఫ్లాట్ ఓనర్స్ వారి వారి అభిప్రాయాలు తెలపాలని కోరారు. ఉప్పల్ భగాయత్ రైతులందరూ మరియు ఫ్లాట్ ఓనర్స్ అందరూ తప్పక ఈ సమావేశానికి హాజరై వారి వారి అభిప్రాయాలు తెలిపి, సభను జయప్రదం చేయవలసిందిగా ఉప్పల్ భగాయత్ ప్లాట్ల యజమానులను కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బ నరసింహారెడ్డి, మేకల శివారెడ్డి, సల్ల రాజిరెడ్డి, గోనె అర్జున్ రెడ్డి, సల్ల వీరారెడ్డి, మేకల మధుసూదన్ రెడ్డిడి, మేకల హనుమంత్ రెడ్డి, ధర్మ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బొమ్మగాని దాస్ గౌడ్, శ్రీ రాములు గౌడ్, మేకల వెంకట్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం బడ్డీ కొట్లు ఏర్పాటు చేపట్టాలని కేకేడి డిమాండ్



మధిర ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు వైయస్సార్ నియోజకవర్గ ఇంచార్జ్ దొంత మాల కిషోర్ కే కే డి ఈ సమావేశంలోత్వరలో చిరు వ్యాపారుల తో సమావేశం కానున్న కేకేడిమీడియా చిట్ చాట్ లో వైఎస్ఆర్ టిపి మధిర నియోజకవర్గ ఇన్చార్జి కేకేడి దొంతమాల కిషోర్ కుమార్ వైఎస్ఆర్ టిపి మధిర నియోజకవర్గ ఇంచార్జ్ దొంతమాల కిషోర్ కుమార్ కే కే డి మీడియాతో మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో బోనకల్లు, మధిర ఆర్.బి క్రింద మరియు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న బడ్డీ కొట్లులను అభివృద్ధి., ట్రాఫిక్ ఆటంకం అంటూ అర్థం పర్థం లేని ఆరోపణలతో దశాబ్దాల తరబడి బడ్డీ కొట్లు పై జీవనోపాధిగా చేసుకుని జీవనం సాగిస్తున్న వందలాది చిరు వ్యాపారులను నిర్దాక్షిణ్యంగా వారి బడ్డీకొట్టు తొలగించి రోడ్డు పాలు చేయడం ఘోరమైన చర్య . వారికి ఎటువంటి ప్రత్యామ్నాయంగా బడ్డీ కొట్లు ఏర్పాటు చూపకుండానే చర్యలు చేపట్టడం ముమ్మాటికీ ప్రజాప్రతినిధుల వైఫల్యం అని ధ్వజమెత్తారు. త్వరలో చిరు వ్యాపారులతో సమావేశమవుతామని వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని వైఎస్సార్ టిపి తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని కే కే డి తెలిపారు

# దేశానికి అన్నం పెట్టే రైతన్న కు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం: గంగుల కమలాకర్

కరీంనగర్, ఏప్రిల్ 29 ప్రజాపాలన : :దేశానికి అన్నం పెట్టే రైతన్నకు అండగా అండగా నిలబడాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలం కమాన్ పూర్, హాజీపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పెద్దన్నగా అండగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వం నిలవలేదని, మానవతకు మారుపేరు అయినా కెసిఆర్ రైతులకు అండగా నిలబడ్డారు అన్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు దేశానికి అన్నం పెట్టే రైతన్న అరగోస కోసం పడేవారని సాగునీరు లేక సాగునీరు ఉంటే కరెంటు లేక రెండు ఉంటే పెట్టుబడి లేక, కాలం కత్తిరించి పంట పండించిన కొన్ని నాథుడు లేక చాలా ఇబ్బందులు పడేవారు అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రైతుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతు కావాల్సిన పంటల సాగుకు పెట్టుబడి దానికోసం రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయరంగానికి 24 గంటల ఉచిత కరెంటు, సాగునీరు అందిస్తూ రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ఏ రైతుకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, ఏ రైతు ఇబ్బందులు ఉన్నాయని పిర్యాదు చేయడం లేదని అన్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 357 కొనుగోలు కేంద్రాలు పాడు చేయనున్నట్లు ఇప్పటికే 180 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు, 2,46,000 వేల ఎకరాల్లో వరిసాగు 3,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సెకరించే అంచనా వేసాం, ఇప్పటివరకు 1682 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమయ్యాయని దిగుబడి బ్రహ్మాండంగా వచ్చే సూచనలతో ఎకరాకు 25 నుండి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెపుతూ రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో రైతులు ఎవరూ దళారులకు, మధ్యవర్తులకు అమ్ముకోవద్దని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశంతో గ్రేడ్ ఏ రకానికి 1960ఎబి కనీస మద్దతు ధర, సాధారణ రకానికి1940/- కనీస మద్దతు ధర కేటాయించి కొనుగోళు చేస్తున్నామని, రైతులకు అండగా ప్రభుత్వం ఉందని పునరుద్ఘాటించారు. చాలా మంది అర్థం పర్థం లేని అనవసర ఆరోపణలు చేస్తున్నారని, సరైన అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అందుబాటులో గన్నీ బ్యాగులు లేవని కొనుగోలు కేంద్రాలు తెరవడం లేదని, ఇతర సామాగ్రిని సైతం అందుబాటులో లేవని మాట్లాడుతున్నారని ఇవన్నీ అవాస్తవాలన్నారు. ఈ యాసంగిలో 15 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమని, ప్రొక్యూర్మెంట్ మొదలు పెట్టినప్పుడే 1 కోటి 60 లక్షల బ్యాగులు అందుబాటులో ఉన్నాయని చెప్పామని, మొత్తం సివిల్ సప్లైస్ యంత్రాంగం త్వరితగతిన స్పందించి మిల్లర్లు, రేషన్ డీలర్ల నుండి పాత గన్నీలు సేకరించామన్నారు. అంచనాకు మించి తక్కువ సమయంలోనే గన్నీలు సేకరించిన విషయాన్ని వెల్లడించారు మంత్రి గంగుల. ఈ నెలాఖరు వరకు 3 కోట్ల గన్నీలు అవసరముంటే నిన్నటివరకే 6 కోట్ల 85 లక్షల గన్నీలు సేకరించి సిద్దంగా ఉంచామన్నారు, ఇందులో కొత్తవి 57లక్షలు అందుబాటులో ఉండగా మరో 8 కోట్లు కొత్త గన్నీలు అవసరమన్నారు, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసామని, వాటిని కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. తప్పుడు సమాచారం ప్రజలకు ఇవ్వొద్దని హితవు పలికారు, అన్ని జిల్లాలకు అవసరమైన గన్నీలు పంపామని, కావాలంటే స్వయంగా చెక్ చేసుకోవాలని, అబద్దాలు ప్రచారం చేయడం తగదన్నారు మంత్రి. దుష్ప్రచారాలు నమ్మోద్దని రైతులకు విజ్ఞప్తి చేసారు, ఫెయిర్ ఆవరేజ్ క్వాలిటీతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఇవ్వండని, అలా ధాన్యం తూకం ఐపోయిన తర్వాత ఇంటికి వెల్లొచ్చన్నారు, ఆ తర్వాత బాధ్యత అధికారులు చూసుకుంటారన్నారు. రైతుకు రైస్ మిల్లులకు సంబంధం లేకుండా చూసామన్నారు, ఎక్కడైనా తరుగు తీసే అవకాశం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామని, అలా లేని పక్షంలో కలెక్టర్లకు నివేదిక ఇవ్వాలన్నారు. 6920 కోనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అంచనా వేసామని, అవసరమైన ప్రతీ చోట ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు. ఇప్పటివరకూ కొనుగోళ్లపై ఏ రైతు వద్దనుండి కంప్లైంట్ రాలేదని అన్నారు. 2384 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని 873 కొనుగోలు కేంద్రాల్లో సేకరణ జరుగుతుందన్నారు 1 లక్షా 86 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నామని, 1 లక్షా 74 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు తరలించడంతో పాటు రైతులకు డబ్బులు రెండు రోజుల్లోనే అకౌంట్లలో వేస్తామన్నారు. ఈ ధాన్యంలో ఒక్కరైతు కూడా తరుగు తీసారని చెప్పలేదన్నారు. ఇది కొనుగోల్లలో ముఖ్యమంత్రి తీసుకున్న గొప్ప నిర్ణయమన్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు ప్రభుత్వం, భూమి, సాగు ఉన్నా ఈ దిగుబడి ఎందుకు సాధ్యం కాలేదన్నారు, దుక్కి దున్నాలంటే బాంకులోన్లు, షావుకారి రుణాలు పెరిగి, నీళ్లులేక, కరెంటు లేక పంట ఎండి భూములు అమ్ముకునే పరిస్థితి ఉండేదని, అరకొర పండిన పంటను కూడా దళారులే బొక్కేసేవారన్నారు, కానీ తెలంగాణను సాధించిన ఉద్యమకారుడే పాలకుడుగా ఉన్నాడని, కేసీఆర్ గారి ప్రభుత్వం చేసిన క్రుషి రైతు అనుకూల విధానాల వల్ల సాధించిన గణనీయమైన ప్రగతి ఇది అన్నారు, కానీ చల్లగున్న రైతన్నను చూసి ఓర్వకుండా కేంద్ర బీజేపీ మోకాలడ్డుతూ కొనవల్సిన బాధ్యతల్నుండి చేతులెత్తేసిందన్నారు, ఈ పరిస్థితుల్లో కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రి లేకపోతే గతంలో మాదిరి రైతు ఆత్మహత్యలకు దారి తీసేదన్నారు. మానవత్వం గల ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఎంత ఖర్చైనా భరించి రైతుకు అండగా ఉండి చివరి గింజ వరకూ కొనాలని నిర్ణయం తీసుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు మంత్రి గంగుల రైతు పంటలు మానేస్తే దేశానికి అన్నం పెట్టే వారెవరన్నారు, ఈ కార్యక్రమంలో పి ఎ సి ఎ స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్రెడ్డి, ఎంపీపీ శ్రీలత, జెడ్ పి టి సి పెద్దల కరుణ, పి ఎ స్ సి ఎ స్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సురేష్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ జి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రవెల్లి కార్యదర్శి పై తక్షణమే చర్యలు తీసుకోవాలి

**బిజెపి మండల నాయకులు గజెల్లీ రాజకుమార్ డిమాండ్**



బెల్లంపల్లి ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి మండల చంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నీ, ప్రభుత్వం నుండి వచ్చిన నిధుల, ఆదాయ, వ్యయాల, వివరణ ఇవ్వాల్సిందిగా గత మూడు సంవత్సరాల నుండి రాతపూర్వకంగా అడిగిన, తలతిక్క సమాధానాలు చెప్పి దాటవేస్తూ కాలయాపన చేస్తున్నారే తప్ప సరైన సమాధానం ఇవ్వడం లేదని, ఇలాంటి కార్యదర్శి పై వెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని, బెల్లంపల్లి మండల బిజెపి నాయకుడు గజెల్లి రాజకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పత్రికల వారితో మాట్లాడుతూ గ్రామపంచాయతి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో, గ్రామప్రజల సమక్షంలో, చంద్రవెల్లి గ్రామంలో గ్రామ కార్యదర్శి ని 2019 నుంచి, చంద్రవెల్లి గ్రామానికి ఎన్ని నిధులు వచ్చాయి, వాటికి సంబంధించిన స్టేట్ మెంట్, మరియు పూర్తి సమాచారం ఇవ్వాలని, ఇంకుడుగుంతల వివరాలు, స్మశానవాటిక బిల్స్, మరియు అడ్వాన్స్ పేమేంట్ వివరాలు అడిగితే, సమయం లేదనీ, తీసుకురాలేదనీ, తరువాత ఇస్తాననీ, నిర్లక్ష్యపు సమాధానం చెప్తున్నాడనీ ఆయన అన్నారు, అధేవిధంగా స్మశాన వాటికకు మొత్తం బిల్ 10లక్షల 40 వేలు అయితే ఇప్పటికీ 9 లక్షల 60వేలు బిల్ మంజూరు అయిందనీ, స్మశాన వాటిక నిర్మాణ దశలో ఉన్నప్పుడు అడ్వాన్స్ పేమేంట్ క్రింద గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ ఆకౌంట్ నుంచి 6 లక్షలు తీసుకున్నారనీ. 9లక్షల 60 వేల బిల్ మంజూరు అయిన గ్రామపంచాయితీకి తిరిగి 4 లక్షల రూపాయాలు మాత్రమే చెల్లించాడనీ, మిగిలిన 2లక్షలు ఎందుకు చెల్లించలేదని కార్యదర్శి ని అడిగితే నా దగ్గర పూర్తి సమాచారం లేదనీ, తరువాత ఇస్తానని, తప్పించుకునే సమాధానం ఇస్తున్నాడని, దీనిపై గ్రామసభ కంటే 5 రోజుల ముందు గ్రామ కార్యదర్శి కి గ్రామసభ రోజున సంబంధిత అధికారులు అందరు హాజరు అయేవిధంగా చూడాలని , గ్రామపంచాయతి కి సంబంధించిన అన్ని శాఖల పూర్తి సమాచారం మరియు 2019 నుంచి నేటి వరకు లావాధేవీల వివరాలు, అన్ని రశీదులు, మెసర్మెంట్ బుక్స్ , ఎంబిలు, అన్ని గ్రామసభలో ఉండేవిధంగా చూడాలని కార్యదర్శి కి వ్రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసిన, ప్రతీది లేవు అంటూ, విధులలో నిర్లక్ష్యం వహించినానని నా పై అధికారులకు ఫిర్యాదు చేసుకో అని గ్రామప్రజల ముందు నిర్లక్ష్యపు సమాధానాన్ని ఇస్తున్నాడని. దీనిపై వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేయకతప్పదని, ఆయన హెచ్చరించారు.

## దళిత సర్పంచ్ భర్తపై దాడి దుర్మార్గపు చర్య, నిందితులను కఠినంగా శిక్షించాలి...

**టిఏవైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్ డిమాండ్**



రాయికల్ , ఏప్రిల్ 29(ప్రజాపాలన ప్రతినిధి): రాయికల్ మండలం కిష్టంపేట గ్రామ దళిత సర్పంచ్ భర్త జాన గోపిపై అదే గ్రామనికి చెందిన కొలా రవితేజ, రాజ్ కుమార్, చల్ల నర్సయ్య, రాజంలు గ్రామంలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తుంటే అడ్డగించిన సర్పంచ్ భర్త పై మండల తహశీల్దార్, ఉప సర్పంచ్ గ్రామ ప్రజల ముందే దాడి చేయడం దుర్మార్గపు చర్యని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేట భాస్కర్ ఖండించారు. శుక్రవారం కిష్టంపేటలో వివాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు మరియ దాడి జరిగిన గోపిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు దుమాల రాజ్ కుమార్, టిఏవైఎస్ జిల్లా అధ్యక్షులు కొంగర పవన్ తో కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా పేట భాస్కర్ మాట్లాడుతూ వివాదాస్పదమైన 153 సర్వే నెంబర్లోని ప్రభుత్వ భూమి గతంలో స్మశానవాటిక కాగ దాన్ని ఐకెపి సెంటర్గా గ్రామపంచాయతీ తీర్మానంతో గ్రామ ప్రజలకు ఉపయోగపడెలా తహశీల్దార్ సమక్షంలో ఏర్పాట్లు చూస్తుండగా అందరి సమక్షంలో దాడి చేయడం అమానుషమని వారి కుల అహకారానికి నిదర్శనం అన్నారు. గోపి దళితుడు కాబట్టే రెచ్చిపోయి దాడి చేశారని అలాంటి నిందితులను అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పేట భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ స్థల పరిశీలనలో టిఏవైఎస్ జిల్లా నాయకులు గజ్జెల రాజు,ఎనుగందుల మోహన్, దుమాల గంగాధర్, గ్రామ ఉప సర్పంచ్ చింతలపెల్లి రాజేశ్వర్ రెడ్డి, రైతులు నల్ల రాజం,నల్లాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచార కేసు నమోదు

వైరా : శాంతి నగర్ కు చెందిన కొమ్ము నాగరాజు అనే వ్యక్తిపై శుక్రవారం వైరా పోలీస్ స్టేషన్ లో అత్యాచార కేసు నమోదు అయింది మండలంలోని గొల్లేనపడు గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోమని యువతి కోరగా నాగరాజు నిరాకరించడంతో ఆమె వైరా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది ఈ మేరకు ఎస్ఐ శాఖమూరి వీరప్రసాద్ కేసు నమోదు చేయగా సి ఐ టి సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు

## వేడి గాలుల నుండి పంటలను, పశువులను కాపాడుకోండి

**కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్ నాయక్**



బెల్లంపల్లి ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి: రానున్న నాలుగు రోజుల్లో తెలంగాణలోని మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, జిల్లాల్లో రెండు నుండి నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగి, వేడి గాలులు వీచే అవకాశం ఉందని, రైతులు వారి పంటలను, పశువులను, గొర్రెలను, కోళ్లు పెంచే రైతులు, తగిన చర్యలు తీసుకుని వాటిని ఉష్ణోగ్రతల బారినుండి కాపాడుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వరి నాయక్ తెలిపారు. శుక్రవారం నాడు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ , హైదరాబాద్ వాతావరణ కేంద్రం నుండి అందుతున్న సమాచారం ప్రకారం వచ్చే నాలుగు రోజుల పాటు తెలంగాణలోని కొన్ని జిల్లాలతోపాటు మంచిర్యాల, మరియు కొమరం భీమ్, ఆసిఫాబాద్ జిల్లాలలో కూడా ఉష్ణోగ్రతలు 2 నుండి 4 డిగ్రీల వరకు పెరిగి వేడి గాలులు వీచే అవకాశం ఉందనీ. రైతులు ఈ పరిస్థితులలో పంటలకు తేమను అందించడానికి వీలైనన్ని ఎక్కువసార్లు నీటి తడులను పెట్టడంతోపాటు, ఎటువంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవడం మంచిదనీ. పశువులు, గొర్లు, మరియు కోళ్లు పెంచుకునే రైతులు, ఎండ వేడి నుండి, జంతువులను కాపాడుకునే చర్యలను తీసుకోవాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు..

## యూఎన్ చీఫ్ కళ్లముందే రష్యా క్షిపణి దాడులు..

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులను పరిశీలిస్తుండగా రష్యా క్షిపణుల వర్షం కురిపించింది. దీంతో యూఎన్ బృందం ఉలిక్కిపడింది. యుద్ధతీవ్రత, ప్రభావం ఎంత దారుణంగా ఉందో రష్యా దాడివల్ల తెలిసిందని, అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదని ఐక్యరాజ్య సమితి మానవతా విభాగం అధికార ప్రతినిధి సవియానో అబ్రెయూ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, గుటెరస్ పర్యటిస్తున్న ప్రాంతానికి ఎంత దూరంలో క్షిపణి దాడి జరిగిందన్న వివరాలను ఆయన వెల్లడించలేదు. కాగా రష్యా దాడిని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఖండించారు. మాస్కోలో చర్చలు జరిపిన గుటెరస్ కీవ్‌కు చేరగానే క్షిపణులు, ఐదు రాకెట్లతో దాడులకు పాల్పడిందని, ఇది ఐక్యరాజ్య సమితిని అవమానించడమేనని అన్నారు. రష్యా నాయకత్వ వైఖరికి ఈ ఘటన అద్దం పడుతోందని అన్నారు. కాగా మరియపోల్ స్టీల్‌ప్లాంట్‌లో కనీసం లక్షమంది చిక్కుపోయారని, వారిని అక్కడినుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహకరించాలని రష్యాను కోరినట్లు జెలెన్స్కీతో భేటీ సందర్భంగా గుటెరస్ చెప్పారు. అయితే అందుకు భిన్నంగా అక్కడి పరిస్థితులున్నాయి. ఏ ఒక్కరినీ బయటకు వెళ్లనీయడం లేదని, ఔషధాలు, ఆహారం అందనీయడం లేదని డోన్‌బాస్ గవర్నర్ పావ్‌లో కిరిలెంకో వెల్లడించారు.

# కొత్తపల్లి గ్రామపంచాయతీ ముందు ఉపాధి కూలీలు ధర్నా



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి.: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఈరోజు కొత్తపల్లి గ్రామపంచాయతీ ఆఫీస్ ముందు. వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు కావాలి జగన్ (ఉపసర్పంచి )అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి అంజయ్య పాల్గొని మాట్లాడినారు 10వారాల నుండి పని చేస్తున్న కూలీలకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం డబ్బులు వెయ్యాక పోతే బ్రతికేది ఎట్లా . చేసిన పనికి డబ్బులు రాకపోవడం వలన ప్రభుత్వం పెంచిన నిత్యావసర ధరలతో కూలీలు అర్ధాకలితో అలమటిస్తు న్నారు కనీస అవసరాలు తీరాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి తక్షణం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. ప్రతివారం క్రమం తప్పకుండ డబ్బులు ఇయ్యాలి. అనుభవం లేనివారిణి సీనియర్ మేట్ గా పెట్టడం వలన కూలి పెద్దఎత్తున నష్ట పోతున్నారు కాబట్టి 10 సంవత్సరాల అనుభవం వున్నా కె జంగయ్య ఫీల్డ్ అసిస్టెంట్ గా ఉండాలని కూలీలు పెద్దఎత్తున కోరుతున్నారు కాబట్టి అతన్ని తక్షణం తీసుకోవాలి. లిడిమాండు పెట్టిన పని కల్పించని గ్రూపులు. కూలీలు(1)మాడెల్ 3వారాలు 16మంది.(2) చందన్ 7వారాలు 20మంది. (3)వెనుకొండ 2వారాలు 8 మంది దరఖాస్తులు పెట్టిన అధికారుల నిర్లక్ష్యం వలన 44 మందికి పనిరాలేదు కాబట్టి వీరికి నిరుద్యోగ భృతి ఇవ్వాలి వెంటనే పని కల్పించాలి. గ్రామ పంచాయతీ లో డిమాండు తీసుకొని రసీదు ఇవ్వాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలి 600రూపాయలు ఇయ్యాలి. సంవత్సరానికి 200రోజులు పనికల్పించాలి. 2సార్లు ఫొటో తీసే విధానం (333 జి ఓ) రద్దు చేయాలి. మాస్టర్ లో పేర్లు తెలుగులో ఇంటి పేరుతొ రావాలి.25 మందికి ఒక గ్రూపు ఏర్పాటు చేసి మెట్లను పెట్టాలి . గ్రూపుల వారీగా పని చెప్పాలి . డిమాండు పెట్టినాక పనికి పోక పోతే పని రోజులు తగ్గించే విధానం రద్దు చేయాలి. పని ముట్లు ఇయ్యాలి పని ప్రదేశం లో కనీస సౌకర్యాలు కల్పించారు. మెడికల్ కిట్లు ఓవరేస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలి కూలీలా సమస్యలన్ని పరిష్కరించాలని ఈ సందర్భంగా పలు డిమాండ్ల తో కూడిన వినతి పత్రం గ్రామ పంచాయతీ సెక్రెటరీ వేణు కి మెమోరాండం ఇవ్వడం జరిగింది ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మండల నాయకులు యాదయ్య కాస కృష్ణ గ్రామ కార్యదర్శి. జంగయ్య, యాదిరెడ్డి,కృష్ణ రెడ్డి, సాయిలు, రమేష్, శ్రీకాంత్, పరమేష్, బి పద్మ, లక్ష్మమ్మ, మల్లారి, సునీత, యాదమ్మ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాన్ని కేటాయించాలని తాహసిల్దార్ కు వినతి



జన్నారం, రూరల్, ఏప్రిల్ 29, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం జర్నలిస్టు లందరికి ఇళ్ల స్థలాన్ని కేటాహించాలని మండల ప్రెస్ క్లబ్ అదర్యంలో స్థానిక తాహసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలునేరు నర్సయ్య అన్నారు. ఈ సందర్భంగా అయన గురువారం మాట్లాడుతూ నాటి ఉమ్మడి రాష్ట్రం నేటి నూతన తెలంగాణా రాష్ట్రం వరకు మండలంలో అనేక సంవత్సరములుగా వివిధ పత్రికలలో విలేఖరులుగా పనిచేస్తున్నామని స్థానిక విలేకరులకు పక్క ఇంటి నిర్మాణం కొరకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని పలు మార్లు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, అర్,డి,ఓ, లతో పాటు జన్నారం తాహసిల్థార్ వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని అయిన పలితం లేకుండా వుందని అయన పేర్కొన్నారు, ఇప్పటికైనా మండలంలో వున్న హర్షులైన ప్రెస్ క్లబ్ విలేకరులందరికి గ్రూహ నిర్మాణం స్థలం ఇప్పించే విధంగా ప్రస్తుత తాహసిల్థార్ జన్నారం కు అయన తెల్పానైనది, ఈ కార్యాక్రమంలో మండల తాహసిల్థార్ ఇట్యాల కిషన్, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలునేరు నర్సయ్య, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## అప్నా యూత్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



కొడిమ్యాల, ఏప్రిల్ 29 ( ప్రజాపాలన ప్రతినిధి ) :జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం లోని రామకృష్ణాపురం గ్రామంలో అప్నా యూత్ వెల్ఫేర్ వారి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిం చారు. కంటి పరీక్షలుచేయించుకున్న గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామానికి వచ్చి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కావలసిన మందులు మరియు కంటి అద్దాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది అప్తోమేటరిస్ట్ డా"శివరాజ్, చందు, లత, శ్రీనివాస్ మరియు గ్రామస్తులు తదితులు పాల్గోన్నారు.

## ఆర్టీసీలో ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ



మధిర ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు టి ఎస్ ఆర్ టి సి డిపో నందు తమ విధులలో ఉత్తమ ప్రతిభ కనపరచ్చినందుకు గాను టి ఎస్ ఆర్ టి సిగౌరవయం డిసజ్జనార్ చేతుల మీదుగా ప్రగతి చక్రం అవార్డు అందుకున్న ఉత్తమ ఉద్యోగులను అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిపో మేనేజర్ శ్రీ యస్. దేవదానం మాట్లాడుతూ ఈ ప్రతిభను స్ఫూర్తిగా తీసుకోని అందరు మన సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రతిభకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రగతి చక్రం అవార్డు గ్రహీతలు శ్రీ వాకా. వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరిండెంట్ మెకానికల్ , శ్రీ వై. వి. రమణ, ఎలక్ట్రీషియన్ , దుస్సాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమం నందు గ్యారేజ్ సూపర్ వైజర్ లు, ట్రాఫిక్ సూపర్ వైజర్ లు, ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది, కండక్టర్ లు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలు తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: బొంతు రాంబాబు



మధిర ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో శుక్రవారం నాడుమధిర మండలం ఆత్కూరు, మాటూరు గ్రామంలో నకిలీ పొద్దుతిరుగుడు విత్తనాలు వాడి రైతులు నష్టపోయారని రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. అత్కురు మాటూరు గ్రామాలలో రైతులు పొద్దుతిరుగుడు పంటను 150 ఎకరాలలో సాగు చేశారని మొక్కలు మంచిగా ఏపుగా పెరిగాయి ఒక్కో మొక్కకు సుమారుగా 15 నుండి 20 పూలు కాయడం, పువ్వు నందు 70 శాతం విత్తనాలు తాలు గింజలు గా మారాయని దీంతో రైతులుకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మధిర వ్యవసాయ శాఖ అధికారి గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మందా సైదులు. సిఐటియు జిల్లా నాయకులు శీలం నరసింహారావు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఓట్ల శంకర్రావు. సిఐటియు నాయకులు పడకంటి మురళి. తేలప్రోలు రాధాకృష్ణ నష్టపోయిన రైతులు పాల్గొన్నారు.

## సకాలంలో బిపి, షుగర్ లను గుర్తించాలి డాక్టర్ వెంకటేష్



మధిర ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో శుక్రవారం నాడు మాటూరు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్లు నరసింహారావు ప్రభాకర్ రావు సహకారంతో ఈరోజు రామచంద్రపురం, గ్రామాలలో షుగర్, బీపి ఇతర అనారోగ్యంల తో బాధపడుతున్న వారి కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి, 30 సంవత్సరాలు దాటిన అందరికీ షుగర్ పరీక్షలు,బీపీ పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను నెలకు సరిపోను ఇవ్వటం జరిగింది.. అలానే ప్రైవేట్ లో మందులు వాడుతున్న షుగర్, బిపి వారికి గవర్నమెంట్లో మందులను ఇవ్వడం జరిగింది.ఆరోగ్య అవగాహన కల్పిస్తు, నెలనెలా పరీక్షలు చేయించుకుని షుగర్ బీపీ ని అదుపులో పెట్టుకోవాలని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని, రోజు ఒక గంట సేపు వాకింగ్,సైక్లింగ్ చేయాలని, అలానే మాటూరు పేట నుంచి ప్రతిరోజు రక్త పరీక్షలు చేయడం జరుగుతుందని తెలియ పరచారు. క్యాంపులో నెలకు సరిపోను మందులను ఉచితంగా ఇవ్వటం జరిగింది.. క్యాంపులో 210 మందికి టెస్టులు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణ అధికారులు భాస్కరరావు, శరత్ కుమార్ రాణి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ మహిళా ఆరోగ్య కార్యకర్తలు సుజాత, ఝాన్సీ, ఆశా కార్యకర్తలు సీత ,శారద పాల్గొన్నారు..


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | అమీర్‌పేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 8688810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| బాబురావు గొండ్ల | తల్లాడ మండలం | 9848236015 |
| వై.నర్సింహులు | తాండూరు | 7207677049 |
| డి.ప్రవీణ్ కుమార్ | కొడంగల్ | 9666027635 |
| టి.సురేష్ చారీ | ఆసిఫాబాద్ | 9000983108 |
| డి.భాస్కర్ | బెల్లంపల్లి | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | జన్నారం రూరల్ | 9493314399 |


## మండల్ పరిషత్ నిధుల నుండి డ్వాక్రా మహిళా భవనానికి ఆరు లక్షలు మంజూరు చేసిన ఎంపీపీ కృపేష్





ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామాంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సూచన మేరకు ఇబ్రహీంపట్నం ఎంపీపీ పి.కృపేష్ అసంపూర్తిగా ఉన్న డ్వాక్రా భవనం నిర్మాణం పూర్తి చేయుటకు మండల పరిషత్ నుండి రూ.6 లక్షల నిధులు మంజూరు చేసి,మహిళల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు%ొ%.నిర్మాణ పనులను ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఏనుగు భరత్ రెడ్డి, సర్పంచ్ సామల హంసమ్మ, ఉపసర్పంచ్ ఎండి మునీర్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీఓ క్రాంతి కిరణ్, ఏఈ ఇంద్రసేనా రెడ్డి, ఎంఈఓ వెంకట్ రెడ్డి, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జలంధర్, నాయకులు యాదయ్య, శంకరయ్య, సతీష్, మల్లా రెడ్డి, భోజి రెడ్డి, సామల శ్రీనివాస్ రెడ్డి, దాసు, శ్రీశైలం, సువర్ణ , సంగీత , విజయలక్ష్మి , బాలమణి, టీఆర్ఎస్వీ మండల ప్రధాన కార్యదర్శి కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దయానంద్ సహకారంతో రంజాన్ తోఫా పంపిణీ..



తల్లాడ, ఏప్రిల్ 29 (ప్రజాపాలన న్యూస్): తల్లాడ మండలంలోని అన్నారు గూడెం గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆర్థికసాయంతో అందించిన రంజాన్ తోఫా ను శుక్రవారం పంపిణీ చేశారు. ముస్లిం మత పెద్దలు ఎండీ హల్ జల, మసీదు కమిటీ అధ్యక్షులు ఎండి. బాబు చేతులమీదుగా అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈ తోఫాను పంపిణీ చేసిన డాక్టర్ దయానంద్ కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్. యాకూబ్ పాషా ఆధ్వర్యంలో వీటి సహకారానికి తోడ్పాటునందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ యాకూబ్ పాషా, జమాల్, హుస్సేన్, హుస్సేన్ బీ, లాల్ బేగ్, నాగుల్ మీరా, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన, బార్ కమిటీ సభ్యులను సన్మానించిన బిజెపి నాయకులు



బెల్లంపల్లి ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి: బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలల్లో ఇటీవల గణ విజయం సాధించి, అధ్యక్షులుగా ఎన్నికైన. అంకం శివకుమారుని, మరియు ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన చేను రవి కుమార్ ను, భారతీయ జనతాపార్టీ బెల్లంపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఘనంగా సన్మానం చేయడం జరిగిందనీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముని మంద రమేష్ తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోడి రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాచర్ల సంతోష్. ఉపాధ్యక్షులు మేకల రాజశేఖర్. జిల్లా కార్యవర్గ సభ్యులు సబ్బని రాజనర్సు. ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల శ్రీనివాస్. ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్. సీనియర్ నాయకులు రేవెల్లి రాజలింగు. బీజేవైఎం పట్టణ అధ్యక్షులు నామాల చింటూ. కిసాన్మోర్చా అధ్యక్షులు కనకం విజయ్. లీగల్ సెల్ కన్వీనర్ గోలి శ్రీనివాస్. బీసీ మోర్చా ఉపాధ్యక్షులు జీధుల రాములు. నాయకులు దూడ పాక బలరాం. అక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు ఎంపీడీవోను కలిసి వినతి పత్రం



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి : శుక్రవారం రోజు న ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలోని ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులు "6 వారాల నుండి రావడం లేదు. ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనుక ఉపాధి హామీ కూలి పెండింగ్ బిల్లులు త్వరగా మంజూరు చేసే విధంగా చూడాలని ఇబ్రహీంపట్నం ఎంపీడీవో క్రాంతి కుమార్ కి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమం మడుపు వెంకటేష్ , బుట్టి మహేందర్ ముదిరాజ్ ( %జీ=. ఖజ=% ), గ్రామపంచాయతీ వార్డు సభ్యులు నర్కుడి మహేందర్ , ఎంపల్ల ప్రభాకర్ రెడ్డి , మరియు %బూ%లు పద్మ , సువాసిని, తదితరులు పాల్గొనడం జరిగింది.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## ధర్మపురి పయనం

అప్పటికి మా మేనమామ కొడుకు భేతి ఆనందం బీడీ కంపెనీలో బీడీల ప్యాకింగ్ సెక్షన్‌లో పనికి కుదురుకున్నాడు. ఉదయం నుంచి రాత్రిదాకా బీడీ ప్యాకింగ్ జరిగేది. పెద్ద పెద్ద కార్టన్‌లలో నింపి లారీలకు ఎక్కించేపని చాలా బరువైన పని. అయినా చేస్తుండేవాడు. నా బ్యాచ్‌మేట్లకు 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 1970 మార్చిలో పూర్తి కావలసిన బిఎస్సీ ఒక సంవత్సరం వాయిదా పడింది. సరిగ్గా కాలేజీ నడవకపోవడంతో విద్యార్థులు ఇంటికి, కాలేజీకి పల్లెకు పోతూ వస్తూ ఉండేవారు. ఉప్పులంచ శంకర్ అప్పుడప్పుడూ స్వంత ఊరు ఆరవెల్లికి పోతూ వస్తూ ఉండేవాడు. శంకర్ నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. వాళ్ళకు పది ఎకరాల భూమి ఉంది. వాళ్ళ అమ్మ మా అమ్మలాగే బీడీలు చేస్తుంది. శంకర్ అన్న ఉప్పులంచ రాములు గడ్డం సంజీవరావు, బాల్య ప్రభాకర్ తదితరులతో కలిసి రాజకీయాలు చేస్తుండేవాడు. మా అన్న జగిత్యాలలో ఉండి ఉంటే వారితోనే కలిసి ఉండేవాడు. నేను ధర్మపురికి వెళ్ళాలనుకోవడంలో భీమనాతి ప్రభాకర్ కుటుంబం ధర్మపురిలో ఆసరా ఉంటుందని ఆలోచన కూడా ఉండేది. సహదేవ్ అప్పటికే ధర్మపురిలో ఉంటున్నాడు. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రభాకర్ ధర్మపురికి జగిత్యాలకు పోతూ వస్తూ ఉండేవాడు. భీమనాతి ప్రభాకర్‌ది ఒరిజినల్‌గా లొత్తునూరు స్వగ్రామం. అంతకన్నా ముందు వాళ్ళ తాత ధర్మపురి కొల్వాయి ప్రాంతంలోని నర్సింహులపల్లెలో ఉండేవాడు. ఆయుర్వేద వైద్యం బాగా వచ్చునని దొరలు లొత్తునూరుకు పిలిపించుకున్నారు. వాళ్ళు ఇచ్చిన భూములతోపాటు మరికొన్ని కొనుక్కొని స్థిరపడ్డారు. ప్రభాకర్ నాన్న భీమనాతి గంగారామ్ జగిత్యాలలో పట్వారిగిరి నేర్చుకుని ఒకటి రెండు ఊర్లకు పట్వారీతనం సంపాదించుకున్నాడు. దాంతో లొత్తునూరునుండి 1965లో ధర్మపురికి మకాం మార్చి బ్రాహ్మణవాడలో కుటుంబంతో కిరాయికి ఉండేవాడు. 1969-70లో పోలీసు స్టేషన్, జూనియర్ కాలేజికి వెళ్ళే దారిలో స్వంతంగా ఇల్లు కట్టుకున్నాడు. కొత్త ఇంటినుంచి ప్రభాకర్ జగిత్యాలకు, ధర్మపురికి చదువుకోసం అటూ ఇటూ తిరుగుతుండేవాడు. 1970లో ధర్మపురికి ఆర్టీసి బస్సులు సరిగా ఉండేవి కావు. ప్రైవేటు బస్సు సర్వీసులు నడిచేవి. జగిత్యాలనుండి ధర్మపురి ఈశాన్య మూలాన 27 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ప్రైవేటు బస్సు కిరాయ 90 పైసలు ఉండేది. ఆ ప్రైవేటు బస్సులో జగిత్యాలనుండి ధర్మపురికి ముగ్గురు నలుగురు డైలీ పేపర్లు తెప్పించుకునేవారు. వారి పేపర్లను బస్టాండులోని హొటల్లో డ్రైవరు పెట్టేవాడు. మనిషిని పంపించి ఎవరి పేపరు వారు ఇంటికి తెప్పించుకునేవారు. అమ్మ అన్నను యాది చేసుకుంటూ ఏడవడం మొదలుపెట్టింది. “ఎక్కడున్నడో కొడుకు ఉత్తరమన్నా రాయకపాయె” అంటూ చేతిలోని ఆకు కత్తెర కింద పడేసింది. యాదికొచ్చినప్పుడల్లా అన్నను, నాన్నను యాది చేసుకుంటూ ఏడవడం అమ్మకు అలవాటయిపోయింది. అన్న రాజనర్సయ్య ఇంటికి రాకుండా భీవండి, జల్నా, పండరీపురం, బొంబాయి, అహ్మద్‌నగర్, మాలెగామ్ తిరుగుతుండేవాడు. సాంచాల పనిచేసి పొట్ట పోసుకునేవాడు. మా మేనమామ తనవద్ద నున్న డబ్బును హనుమాండ్ల చిన్న రాజ్యం చిన్నులకు వడ్డీకి ఇచ్చి తాను బట్టలు నేస్తుండేవాడు. మేనమామ చిన్నకొడుకు జగన్ 7వ తరగతి చదువుతున్నాడు. ధర్మపురిలో ఈవినింగ్ కాలేజి నడుస్తున్నది. ఎంట్రన్స్ డీఓఎల్, బీఓఎల్ అనే కోర్సులు నడిచేవి. ఇప్పటికీ నడుస్తున్నాయి. ఆ కాలంలో టీచర్ల కొరత చాలా ఉండేది. పంచాయితీ సమితులు ఏర్పడి ప్రతి గ్రామంలో పాఠశాలలు ప్రారంభించడం జరిగింది. అందువల్ల జగిత్యాలలో 1960 నుండి 1967 దాక ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం ప్రభుత్వం నడిపింది. తెలుగు పండిట్లకు, హిందీ పండిట్లకు కొరతగా ఉండేది. దక్షిణ భారత హిందీ ప్రచార సభ, హైదరాబాద్ హిందీ ప్రచార సభ సంస్థలు నిర్వహించే హిందీ పరీక్షల్లో శారదా భూషణ్ వంటి పరీక్షలు నిర్వహించేవారు. ఏ చిన్న హిందీ పరీక్ష పాసైనా హిందీ పండిట్‌గా ఉద్యోగం లభించేది. కాసం శివరాజయ్య గుప్త హిందీ ప్రచార సభ పరీక్షల కో-ఆర్డినేటర్‌గా చాలామందితో ఫీజులు కట్టించేవారు. కాసం శివరాజయ్య గుప్త చక్కని ఆయుర్వేద వైద్యుడు. వితంతు వివాహాల కోసం సంఘసంస్కరణ చేపట్టారు. బాల్య వివాహాలు వద్దని నివారించారు. విలేఖరిగా కూడా పని చేసేవాడు. గాంధేయవాది.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## కళ్యాణ లక్ష్మి చెక్కులను రంజాన్ తోఫా పంపిణీ చేసిన జడ్పీ చైర్మన్



మధిర ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో గురువారం నాడు స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ్ లక్ష్మి రంజాన్ సంబంధించిన తోఫ పంపిణీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజుప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద 42 మంది లబ్ధిదారులకు చెక్కులను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అందజేశారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో తాసిల్దార్ కే రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చెక్కుల పంపిణీ తోపాటు ప్రభుత్వం రంజాన్ పర్వదినం ను పురస్కరించుకొని ప్రతి ఏడాది అందజేస్తున్న రంజాన్ తోఫా లను ముస్లిం మత పెద్దల తో తో కలిసి లింగాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమం కోసం మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో చేస్తున్న కృషి దేశంలో ఏ రాష్ట్రంలో కొనసాగడం లేదని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడపడుచుల పెళ్లిళ్లకు అందిస్తున్న లక్ష నూట పదహారు రూపాయలు వారి కుటుంబాల్లో ఆనందాన్ని ఇచ్చేవిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఏం సి చైర్మన్ చితారు నాగేశ్వరరావు ఎంపీపీ లలిత, ఆత్మ చైర్మన్ కోటేశ్వరరావు రైతుబంధు కన్వీనర్ చావా వేణుబాబు మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం విద్యా లత వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు వై వి అప్పారావు, మేడికొండ కళ్యాణి కిరణ్, సయ్యద్ ఇక్బాల్ లతోపాటు తెరాస పార్టీ మండల పట్టణ బాధ్యులు నాయకులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు

## నవోదయ ఎంట్రన్స్ కి ఏర్పాట్లు పూర్తి: యంఇఓ వై ప్రభాకర్



మధిర ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు జాతీయ స్థాయిలో ఏప్రిల్ 30న జరగనున్న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష కు మధిరలోని 2 పరీక్షా కేంద్రాలకు సంబందించిన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మధిర మండల విద్యాశాఖాధికారి శ్రీ వై ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్బంగా విలేకరుల సమావేశంలో యంఇఓ మాట్లాడుతూ నవోదయ ప్రవేశ పరీక్షకు మధిరలో 2 పరిక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీవీఎం స్కూల్ నందు 132 మంది, గర్ల్స్ హైస్కూల్ నందు 121 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ పరిక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా ఎం నారాయణ, డి రమణయ్య, బి ఎల్ ఓ లుగా వై ప్రభాకర్, బి నాగేశ్వరరావు, సి ఎల్ ఓ లుగా జి వి ఎన్ రాజు, డి సాయికృష్ణమాచార్యులు వ్యవహరించనున్నట్లు తెలిపారు. నవోదయ పరీక్ష శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఉంటుంది కావున విద్యార్థులందరు ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అందరూ తప్పనిసరిగా మాస్కు ధరించి శానిటైజర్, వాటర్ బాటిల్ తీసుకొని రావాల్సిందిగా సూచించారు. అదేవిధంగా హాల్ టికెట్లు రెండు తీసుకుని రావాలని వాటిపై తప్పనిసరిగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సంతకం తీసుకొనిపరీక్షా కేంద్రం లో అందజేయాలని తెలిపారు.

## మరణించిన మెఘవత్ రాజు నాయక్ కుటుంబానికి ఆర్ధిక సహాయం అందజేసిన మర్రి నిరంజన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం పటేల్ చెరువు తండా కు చెందిన మేఘవత్ రాజు నాయక్ నిన్న రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి ఈ రోజు పటేల్ చెరువు తండా కి విచ్చేసి పార్థివ దేహం పై పూలమాల వేసి నివాళు అర్పించి, అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు, కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడం చాలా బాధాకరమన్నారు, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, భగవంతుడు కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని కోరారు, కుటుంబ సభ్యులను ఓదార్చి పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు, తండ్రిని కోల్పోయిన కుమారుడి చదువులకు అయ్యే ఖర్చులు తానే భరిస్తానని హాస్టల్ వసతి కల్పిస్తానని తెలిపారు, కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు, ఈ కార్యక్రమంలో అంబోత్ తండా ఎంపిటిసి రామ్ దాస్ నాయక్,స్థానిక నాయకులు లక్ష్మణ్ నాయక్,గణేష్ నాయక్,ధర్మ నాయక్,శ్రీదర్ నాయక్,హరి నాయక్, ఆరుట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల భాషా,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బగ్గరాములు, మరియు తండా ప్రజలు, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం ముఖ్యమంత్రి కేసీఆర్.రైతుల విస్మరించిన బిజెపి ప్రభుత్వం: జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు



మధిర ఏప్రిల్ 29ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు మధిర సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు. కేంద్ర ప్రభుత్వం రైతుల విస్మరించి నప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటూ రైతులకు అండగా ఉండి రైతు నేస్తం గా ముఖ్యమంత్రి కేసీఆర్ కొనియాడ పడుతున్నారని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం మధిర మార్కెట్ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం రైతులను విస్మరించిన అప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు నేస్తం గా మారి రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజేష్, ప్రజా ప్రతినిధులు, టిఆర్ఎస్ నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వరావు ఆత్మ కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు రైతు బందు చైర్మన్ వేణు నరేందర్ రెడ్డి భాస్కర్ రెడ్డి వంకాయలపాటి నాగేశ్వరరావు వీరారెడ్డి జవీ రెడ్డి ఓంకార్ మేడికొండ కిరణ్ రాఘవ జయకర్ వాసిరెడ్డి నాయకులు అప్పారావు ఎంపీపీ లలిత టిఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ వెంకటేశ్వరరావు వినయ్ కుమార్ బి వి ఆర్ సుధాకర్ మున్సిపల్ వైస్ చైర్మన్ విద్యా లత వార్డు కౌన్సిలర్ మాధవి రైతులు టిఆర్ఎస్ నాయకుడు పాల్గొన్నారు

## మంచాల మండలంలో ఘనంగా బెల్లీ లలిత జయంతి వేడుకలు



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి:భూస్వాముల ఆగడాలకు ఎదురుడిదిన తిరిగి పోరాడిన మహా యోధురాలు మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకురాలు నీళ్ళు నిధులు,నియామకాలు కొరకు గళమెత్తిన మొదటి మహిళ ,గొల్ల కురుమ డోలు దెబ్బ వేదిక వ్యవస్థాపకురాలు బెల్లీ లలితఅక్క జయంతి వేడుకలు మంచాల మండల యాదవ సంగం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల యాదవ సంగం పెద్దలు ముచర్ల వెంకటేష్,గజ్జి ఐలయ్య, బూరుగు ఐలేష్, ఆవుల ప్రశాంత్ యాదవ్, బైకని మహేందర్ యాదవ్, రాజేష్ యాదవ్,సీత మల్లేష్,విష్ణు,నవీన్, బద్దుల సాయి,వట్టి శివ,చరణ్,సీత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ కళాశాల మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇక్కట్లు



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి :శుక్రవారము రోజు ఏబీవీపీ విరపట్నం శాఖ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఇంటర్మీడియట్ కళాశాలను పరిశీలించడం జరిగింది. అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడి కలశాలలో ఉన్న సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబలపల్లి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ . విరపట్నం లో ఉన్నటువంటి ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది కి గురవుతున్నారు అదేవిధంగా సరైన తాగునీటి వసతులు కూడా లేదు అని తెలియజేసారు . విద్యుత్ కి సంబంధించిన ఎలాంటి సవకార్యలు కూడా లేవు అని తెలియజేయడం జరిగింది .అదేవిధంగా కళాశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బంది కి గురవుతున్నారు అని తెలియజేయడం జరిగింది అదేవిధంగా ఈ ఒక్క రాష్ట్ర ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్యను విద్యార్థులకు అందిస్తాం అని ఏవియైతే మాయమాటలు చేపి మోసం చేసిరో కేజీ టూ పీజీ ఉచిత విద్యను కాకుండా ఉన్నటువంటి కళాశాలల్లో సరైన వసతులను ఏర్పాటు చేయాలని డిమైండ్ చేయడం జరిగింది.లేని పక్షాన రానున్న రోజుల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ రాష్ట్ర ప్రభుత్వాని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగా రెడ్డి జిల్లా ఎస్ ఎఫ్ డి కన్వీనర్ సందీప్,రంగరెడ్డి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పవన్ ,గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ , నగర ఉపాధ్యక్షులు సాయి తేజ, నగర సంయుక్త కార్యదర్శి సంతూష్,మహేందర్,శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బెల్లి లలిత అక్క 48 వ జయంతి వేడుకలు




ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి :మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకురాలు తెలంగాణ గానకోకిల బెల్లి లలితక్క 48 వ జయంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఎలిగ్గపల్లి శ్రీరామ్ యాదవ్ ఆధ్వర్యంలో నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో కసరమోని మల్లేష్ యాదవ్ చింతం బాలరాజు యాదవ్, జక్కుల లక్ష్మయ్య యాదవ్ దండే శ్రీశైలం యాదవ్, ఎలిగ్గపల్లి ఐలయ్య యాదవ్,బాబు యాదవ్,ఐలయ్య యాదవ్, పొలమోని సురేష్ యాదవ్, బూరుగు ఐలయ్య యాదవ్, ఆవుల ప్రశాంత్ యాదవ్, పోలమోని రామకృష్ణ యాదవ్, దశు యాదవ్,చింతం రాజేందర్ యాదవ్ దాయి నవీన్ యాదవ్ ఆవుల మల్లేష్ యాదవ్, దాయి సురేష్ యాదవ్,పొలమోని టోనీ యాదవ్,జక్కుల సంపత్ యాదవ్,జక్కుల కుమార్ యాదవ్, ఎలిగ్గపల్లి శ్రీశైలం యాదవ్,దండే శివ యాదవ్, ఎలిగ్గపల్లి విక్రమ్ యాదవ్ ఆవుల శ్రీను యాదవ్, కసరమోని నవీన్ యాదవ్, మరియు యాదవ సంఘము నాయకులు పాల్గొన్నారు.

## దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి:ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లే విధంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేస్తున్నారని ఆంబోతు ప్రవీణ్ నాయక్ తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతున్నారు అని,ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో లో అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ప్రజలకు అందించే విధంగా ఉందని తెలంగాణను దేశంలో గుర్తించే విధంగా భారతదేశంలో ఏ రాష్ట్రం చూసినా తెలంగాణ వైపు మొగ్గు చూపుతుందని ప్రవీణ్ నాయక్ అన్నారు. ఇప్పటికీ ఎంతోమందికి ఆసరా పథకాలు అందించి. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్. వృద్ధాప్య. పింఛన్లు. దివ్యాంగులకు. ఒంటరి మహిళలకు. రైతులకు బంధు. దళిత బంధు. 24 గంటల కరెంటు. ఇంకా మరెన్నో సమస్యల పైన పనిచేస్తుంది తెలంగాణని బంగారు తెలంగాణ తీర్చిన దిద్దిన తెలంగాణ ముఖ్యమంత్రి ఘనతని అని కొనియాడారు.

## ఘనంగా సుశీలా జూనియర్ కాలేజ్ విద్యార్థుల క్లాస్ డే దినోత్సవం



మధిర ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు సుశీల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ ద్వితీయ తరగతుల క్లాస్ డే దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన సుశీల జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ డైరెక్టర్ బూస కోటేశ్వరరావు భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి అధిక మార్కులు తెచ్చుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చి వ్యక్తిగతంగా ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు .ఈ విధంగా ఉన్నత స్థితికి చేరుకోవాలంటే ప్రతి విద్యార్థి విద్యార్థిని క్రమశిక్షణ పట్టుదల అంకితభావంతో చదవాలని అప్పుడే మనిషి ఉన్నత స్థితికి చేరుకోవడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మిలినియం విద్యాసంస్థల అధినేత శ్రీకొలాగాని ప్రసాద్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం నరసింహారావు అమరనేని నవీన్ కుమార్ అధ్యాపకులు అద్దంకి రవికుమార్ ఎస్కే అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి

# "భళా తందనాన" కి రిలీజ్ డేట్ ఇదే.!




టాలీవుడ్ న్యూ ఏజ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో ఒకరైన శ్రీ విష్ణు హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా "భళా తందనాన". దర్శకుడు చైతన్య తెరకెక్కించిన ఈ సినిమా రీసెంట్ గా ఈ నెల రిలీజ్ నుంచి తప్పుకుంది. అయితే మళ్ళీ మేకర్స్ ఆ కొత్త రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేస్తామని తెలిపిన సంగతి తెలిసిందే. మరి ఇప్పుడు ఈ సినిమా రిలీజ్ డేట్ పై కూడా ఈ కొద్ది లోనే మేకర్స్ ఈ మే 6న రిలీజ్ చెయ్యొచ్చని వినిపించాయి.మరి వాటిని నిజం చేస్తూ మేకర్స్ లేటెస్ట్ అఫీషియల్ అనౌన్సమెంట్ ఇచ్చేసారు. ఈ చిత్రాన్ని మే 6నే థియేటర్స్ లో రిలీజ్ చేస్తున్నామని ఇప్పుడు ఒక ఇంటెన్స్ పోస్టర్ తో అనౌన్స్ చేశారు. శ్రీ విష్ణు ఇపుడు మంచి కంటెంట్ తోనే ట్రై చేస్తున్నాడు మరి ఈ సినిమా ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ సినిమాకి మణిశర్మ సంగీతం అందివ్వగా క్యాథరిన్ హీరోయిన్ గా నటించింది. అలాగే వారాహి చలన చిత్రం వారు నిర్మాణం వహించారు.

# బాలయ్య "అన్ స్టాపబుల్" సీజన్ 2కి మొదలైన కసరత్తులు..!




నందమూరి బాలకృష్ణ తొలిసారి ఓటీటీ వేదిక ఆహాలో 'అన్ స్టాపబుల్' అనే టాక్ షోకి హోస్ట్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. వెండితెరపైనే కాకుండా బుల్లితెరపై కూడా బాలయ్య తనదైన మ్యానరిజంతో విశేషంగా ఆకట్టుకోవడంతో ఈ షో తొలి సీజన్ బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ షో రెండో సీజన్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజా సమాచారం ప్రకారం ఈ టాక్ షో రెండో సీజన్‌కి సంబంధించి సన్నాహాలను మొదలుపెట్టినట్టు తెలుస్తుంది. ఈ సారి సీజన్‌కి రాబోయే గెస్ట్ లను కూడా ఫైనల్ చేసే పనిలో పడ్డారట నిర్వాహకులు. ఈసారి గెస్ట్ లుగా చిరంజీవి, వెంకటేష్, ప్రభాస్, తదితరులు గెస్ట్ లుగా వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుంది. అంతేకాదు ఈ సారి మరింత ఎంటర్‌టైనింగ్‌గా ఈ టాక్ షో ను నడపాలని నిర్వహకులు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది.

# "ఆచార్య".. ఓన్లీ మెగా అభిమానులకు మాత్రమే !




మెగాస్టార్ చిరంజీవి సక్సెస్ ఫుల్ డైరెక్టర కొరటాల శివ కాంబినేషన్ లో వచ్చిన సినిమా 'ఆచార్య'. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, పూజా హెగ్డే కీలక పాత్రల్లో నటించారు. కాగా ఈ సినిమా ఈ రోజే ప్రపంచవ్యాప్తంగా విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఈ సినిమా ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం!

కథ:

ధర్మస్థలంలో అధర్మం రాజ్యం వెలున్న క్రమంలో ఆచార్య (చిరంజీవి) అక్కడకి వస్తాడు. ఎంతో ప్రసిద్ధి గాంచిన ధర్మస్థలి అప్పటికే బసవ(సోనూసూద్) చేతుల్లోకి వెళ్ళిపోతుంది. బసవ మరియు అతని మనుషులు చేసే అరాచకాలను ఆచార్య ఎలా అరికట్టాడు? అసలు ఆచార్యకి ధర్మస్థలికి ఉన్న సంబంధం ఏమిటి? ధర్మస్థలిలో నీలాంబరి (పూజా హెగ్డే) ఎవరి కోసం ఎదురు చూస్తూ ఉంటుంది? ధర్మస్థలి పక్కనే ఉన్న పాద ఘట్టం సంరక్షకుడిగా ఉన్న సిద్ధ (రామ్ చరణ్) ఏమైపోయాడు? అసలు సిద్ధ ఎవరు? సిద్ధాకి ఆచార్యకి మధ్య ఉన్న బంధం ఏమిటి? చివరకు ఆచార్య ధర్మస్థలిలో ధర్మాన్ని ఎలా నిలబెట్టాడు? అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్:

అత్యంత భారీ అంచనాలతో భారీ చిత్రంగా వచ్చిన ఈ సినిమా, అద్భుతమైన ఎమోషన్స్ తో, విజువల్స్ తో మరియు భారీ తారాగణంతో తెరకెక్కించబడటమే ఈ సినిమాకి ప్రధాన ప్లస్ పాయింట్. మెగాస్టార్ చిరంజీవి తన పరిపక్వతమైన నటనతో ఈ చిత్రంలోనే ఉత్తమమైన నటనను కనబర్చారు. ముఖ్యంగా క్లిష్టమైన కొన్ని ఎమోషనల్ సన్నివేశాల్లో ఆయన తన మార్క్ నటనతో సినిమాకే హైలెట్ గా నిలిచారు. మరో కీలక పాత్ర సిద్ధగా కనిపించిన చరణ్ సినిమాకి మరో ప్రత్యేక ఆకర్షణ.చిరు చరణ్ ఒకే ఫ్రేమ్ లో కనిపించడం ఫ్యాన్స్ కి అతి పెద్ద విందు భోజనం. పైగా చిరు చరణ్ పాత్రల మధ్య జర్నీ అండ్ ఎలివేషన్స్ అద్భుతంగా అనిపించాయి. అలాగే చరణ్ క్యారెక్టర్ లోని షేడ్స్ చాలా బాగున్నాయి. ఇక చరణ్ సరసన కథానాయకగా నటించిన పూజా హెగ్డే తన స్క్రీన్ ప్రెజెన్స్ తో పాటుగా తన నటనతోనూ బాగా ఆకట్టుకుంది. చరణ్ పూజా హెగ్డే మధ్య కెమిస్ట్రీ కూడా బాగుంది.ఇక సినిమాలో నాజర్, అజయ్, తనికెళ్ల భరణి తమ పాత్రలకి పూర్తి న్యాయం చేశారు. అలాగే ఇతర పాత్రల్లో కనిపించిన మిగిలిన నటీనటులు కూడా తమ నటనతో ఆకట్టుకున్నారు. అదేవిదంగా మహేష్ బాబు వాయిస్ ఓవర్, చరణ్, చిరంజీవి నక్సలైట్లుగా కనిపించే విజువల్స్ మరియు క్లైమాక్స్ సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

మైనస్ పాయింట్స్:

భారీ అంచనాలతో వచ్చిన ఈ మెగా హై ఎమోషనల్ అండ్ యాక్షన్ ఎంటర్ టైనర్ విజువల్స్ పరంగా ఆకట్టుకున్నా.. కథనం పరంగా సినిమా స్థాయికి తగ్గట్టుగా లేదు. అలాగే ఫస్ట్ హాఫ్ లో మరియు సెకండాఫ్ లలో వచ్చే సాగదీత సీన్స్, బోరింగ్ ట్రీట్మెంట్, ఇంట్రస్ట్ గా సాగని మెయిన్ సీక్వెన్స్ స్ అదే విధంగా ముందుగానే అర్ధమయ్యే కొన్ని సన్నివేశాల సినిమాకి మైనస్ పాయింట్స్ గా నిలుస్తాయి.దర్శకుడు కొరటాల శివ సినిమాను ఆసక్తికరమైన విజువల్స్ తో నడిపినా.. స్లోగా సాగే సీన్స్ తో కొన్నిచోట్ల సినిమాని బాగా నెమ్మదిగా నడిపారు. అలాగే సెకెండ్ హాఫ్ లో కూడా కొన్ని సీన్స్ బాగా రొటీన్ గా సాగాయి. ముఖ్యంగా ఆ సీన్స్ లో ఇంట్రస్ట్ మిస్ అయింది. 90 కాలం నాటి వెరీ రెగ్యులర్ మేకింగ్ స్టైల్ తో ఆ సన్నివేశాలు ఉన్నాయి. మొత్తమ్మీద మెగా ఫ్యాన్స్ తో పాటు సాధారణ ఆడియన్స్ కి కూడా బాగా కనెక్ట్ అయ్యే ఎలిమెంట్స్ ఇంట్రస్టింగ్ గా ఉండి ఉంటే ఈ సినిమా పూర్తి సంతృప్తికరంగా ఉండి ఉండేది. కానీ అలా లేదు.

సాంకేతిక విభాగం:

ఈ సినిమాకు సంబంధించి సాంకేతిక విభాగం గురించి మాట్లాడుకుంటే.. సినిమాటోగ్రఫీ వర్క్ అద్భుతంగా ఉంది. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలతో పాటు మిగిలిన సన్నివేశాలను కూడా కథాకథనాలకు అనుగుణంగా చాలా అందంగా చిత్రీకరించారు. మణిశర్మ సంగీతం సినిమాకి బాగా ప్లస్ అయ్యింది. ఎడిటింగ్ కూడా చాలా బాగుంది. అయితే సినిమాలో స్లోగా సాగే సీన్స్ ను సాధ్యమైనంత వరకు ట్రీమ్ చేసి ఉంటే.. సినిమాకి ప్లస్ అయ్యేది. పాటల పిక్చరైజేషన్ కూడా చాలా బాగుంది. నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాణ విలువులు అద్భుతంగా ఉన్నాయి.

తీర్పు:

అత్యంత భారీ అంచనాలతో వచ్చిన ఈ భారీ మెగా ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్.. ఆ అంచనాలను అందకోలేక పోయింది. కాకపోతే, మెయిన్ కథాంశం, చిరు చరణ్ ల నటన, వీరు కలిసి సాగిన సన్నివేశాలు, మెగాస్టార్ మెగా పవర్ స్టార్ స్క్రీన్ ప్రేజన్సీ బాగా ఆకట్టుకున్నాయి. అయితే, రొటీన్ సీన్స్ తో స్లోగా సాగే ప్లే, అక్కడక్కడ బోరింగ్ ట్రీట్మెంట్, ఇక బలం లేని మెయిన్ సీక్వెన్స్ స్.. ఈ సినిమాకి మైనస్ పాయింట్స్ గా నిలిచాయి. ఓవరాల్ గా ఈ చిత్రం ఆకట్టుకోలేకపోయింది.

# సైలెంట్ మోడ్ లో క్రేజీ హీరోయిన్..!



పక్కింటి అమ్మాయిలా కనిపించే నటి. హీరోయిన్ గా తొలి చిత్రంతోనే తెలుగు ప్రేక్షకుల్ని ఫిదా చేసేసింది. అద్భుతమైన నటనతోనే కాకుండా మెరుపుతీగలా మెస్మరైజ్ చేసే డాన్స్ తో స్టార్స్ ని సైతం ఔరా అనిపించింది. తన పక్కన డాన్స్ చేస్తే ఎక్కడ తేలిపోతామో అని స్టార్స్ ఫీలయ్యేలా చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. మెగాస్టార్ సైతం తనతో కలిసి స్టెప్పులేయాలని తన సినిమాలో ఓ నటించాలని ముచ్చటపడ్డారంటే ఆమె ప్రత్యేకత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆమె ఎవరో తెలిసిపోయింది కదూ యస్ సాయి పల్లవి.శేఖర్ కమ్ముముల తెరకెక్కించిన 'ఫిదా' చిత్రంతో భానుమతి ఒక్కటే పీస్ హైబ్రిడ్ పిల్లా రెండు కులాలు రెండు మతాలు అంటూ హాల్ చల్ చేసి తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది. వెండితెరపై ఓ హీరోయిన్ లా కాకుండా మన పక్కింటి అమ్మాయే అనే ఫీలింగ్ ని ప్రతీ ప్రేక్షకుడిలోనూ కలిగించి వాళ్ల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. అలాంటి క్రేజీ హీరోయిన్ ఉన్నట్టుండీ సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయింది. 2022 మొదలై 4 నెలలు పూర్తయినా ఇంత వరకు తెలుగులో మరో చిత్రాన్ని అంగీకరించకపోవడం గమనార్హం. 2021 లో బ్యాక్ టు బ్యాక్ రెండు చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సాయి పల్లవి. నాగచైతన్య హీరోగా శేఖర్ కమ్ముల తెరకెక్కించిన 'లవ్ స్టోరీ' నేచురల్ స్టార్ నాని డ్యుయెల్ రోల్ లో నటించిన 'శ్యామ్ సింగరాయ్' చిత్రాల్లో నటించింది. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాల్ని సొంతం చేసుకుని నటిగా సాయి పల్లవికి మంచి పేరు తెచ్చి పెట్టాయి. ఇదే ఊపులో సాయి పల్లవి నటించిన మరో చిత్రం 'విరాట పర్వం'. రానా హీరోగా నటించగా వేణు ఊడుగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఉత్తర తెలంగాణ లో 90వ దశకంలో జరిగిన యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ మూవీని రూపొందించారు. సురేష్ ప్రొడక్షన్స్ డి. సురేష్ బాబు సమర్పణలో సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు. గత ఏడాది ఏప్రిల్ లో ఈ మూవీ విడుదల కావాల్సి వుంది. అయితే కరోనా కారణంగా రిలీజ్ అలస్యమవుతూ వచ్చింది. ఇక ఈ ఏడాది అయినా రిలీజ్ అనుకుంటే భారీ చిత్రాలు వుండంతో కుదరలేదు. ఇప్పటికీ ఈ సినిమా రిలీజ్ పై మేకర్స్ ఎలాంటి ప్రకటన చేయడం లేదు. ఓటీటీ లో ఈ మూవీని రిలీజ్ చేస్తున్నారంటూ వరుస కథనాలు విపిస్తున్నాయి.కానీ టీమ్ నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. ఇదిలా వుంటే ఉన్నట్టుండీ సాయి పల్లవి సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోవడం 2022 మొదలై నాలుగు నెలలు పూర్తి చేసుకున్నా ఆమె మరో సినిమా అంగీకరించకపోవడంతో ఆమె అభిమానులు షాక్ కు గురవుతున్నారు. సాయి పల్లవి ఎందుకు సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయింది? .. సినిమాలు ఎందుకు అంగీకరించడం లేదు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇటీవల మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'వేదాలం' రీమేక్ 'భోళా శంకర్' చిత్రంలో కీర్తి సురేష్ పాత్రలో చిరుకు సోదరిగా నటించమని ఆఫర్ ఇచ్చారు. పాత్ర తనకు నచ్చకపోవడంతో మెగాస్టార్ ఆఫర్ ఇచ్చినా సాయి పల్లవి సున్నితంగా తిరస్కరించింది. స్క్రిప్ట్ పాత్ర నచ్చితేనే సినిమాలు చేయాలని నిర్ణయించుకున్న సాయి పల్లవి ఆ కారణంగానే సినిమాలు అంగీకరించడం లేదని అంటున్నారు.






Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989